


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు





సంపుటి : 14 | సంచిక : 02 | అక్టోబర్ 2008

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 32

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551


ఈ సంచికలో....


జిన్నూరు .............. 06-07-08
హైదరాబాద్ ......... 18-07-08
పెనుమంట్ర ........... 07-05-08
వేండ్ర .................. 12-06-08



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 06-07-08, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవద్గీత, అష్టావక్రగీత అని గీతలు ఎలా ఉన్నాయో గురుగీత అని ఒక గీత ఉంది. గురువు యొక్క విశిష్టత గురించి శివుడు పార్వతికి చెప్పింది గురుగీత. గురువుకు పరమాత్మకి సంబంధించిన జ్ఞానమే కాకుండా రకరకాల భక్తులకు సలహాలు చెప్పటానికి వ్యవహారికజ్ఞానం కూడా ఉండాలి. గురువు మనస్సు నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి, ఆయన భక్తుల క్షేమం కోరుతూ ఉండాలి. ప్రహ్లాదుడు ఎంతో కష్టపడి భక్తిని సంపాదించుకొన్నాడు. ఏమీ ప్రయత్నం లేకుండా, ఏమీ కష్టంలేకుండా భక్తి వచ్చి మీదపడిపోవాలి అని మనం అనుకొంటున్నాము. మీ పొట్టకోసమే ఎంతో కష్టపడుతున్నారు కదా, ఉద్యోగాలు చేస్తున్నారు, అందులో ఎన్నో అవమానాలు భరిస్తున్నారు. పొట్టకోసం అంత కష్టపడేటప్పుడు మరి సత్యజ్ఞానం కోసం మీరు ఏమి కష్టపడుతున్నారు. ఏమీ ప్రయత్నం లేకుండా జ్ఞానంవచ్చి మీదపడాలి అనుకొంటున్నారు, సోమరితనానికి అలవాటుపడిపోయారు. బ్రహ్మపదార్థం యొక్క విలువ మనకు తెలియకపోవటం వలన మనం దాని కోసం ప్రయత్నం చేయటం లేదు, దానిని వదిలివేస్తున్నాము. దానియొక్క విలువ తెలుసుకోవటానికే ఈ సత్సంగాలు లేకపోతే వీటితో పనిలేదు. మీకు భగవంతుడు ఇచ్చిన అవకాశములను సద్వినియోగం చేసుకోండి. చెడ్డపనులు చెయ్యవద్దు. మంచిపనులు చెయ్యండి. మంచిపనులు చెయ్యండి అని ఎందుకు చెప్పారు అంటే మంచిపనులు చేయటం వలన దేహభ్రాంతి తగ్గి

పోతుంది. దేహభ్రాంతి నశించకుండా, దేహాత్మబుద్ధి నశించకుండా ఎంత ప్రయత్నం చేసినా బ్రహ్మాత్మబుద్ధి కలుగదు. గురువు చేయవలసిన పని ఏమిటి అంటే భక్తుడిని దుఃఖస్పర్శ ఎలాఉంటుందో తెలియని స్థితికి తీసుకొని వెళ్ళాలి.

ఒరేపిచ్చివాడా! నువ్వు దేవుడిని అనుకొంటున్నావా. నువ్వు దేవుడివి కాదు, నువ్వు దేవుడి నౌకరువు అని రామకృష్ణపరమహంస అంటారు. దేవుడు ఎక్కడ కూర్చోమంటే నువ్వు అక్కడ కూర్చోవాలి. నువ్వు దేవుడివి అనుకొని పిచ్చిపనులు చేయకు, నువ్వు నౌకరువు. దేవుడు నీ దేహానికి కేటాయించిన పనిని శ్రద్ధగా చేస్తూ ఆ దేవుడిలో ఐక్యమవ్వటానికి ప్రయత్నం చేసుకో, మిగతా పిచ్చిగొడవలలోనికి వెళ్ళవద్దు. నువ్వు నౌకరువు అన్న సంగతి మర్చిపోయి ఈ సృష్టి అంతా నా చేతిలో ఉంది, నేనే దేవుడిని అనుకొంటున్నావు. ఇటువంటి పిచ్చిగొడవలు వద్దు. నువ్వు నౌకరవు అన్న సంగతి మర్చిపోవద్దు. మీరు చేయగలిగినంత వరకు సాధన చేసుకోండి, స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. మీరు రోజుకు వంద రూపాయలు సంపాదించి రెండువందలు ఖర్చు చేస్తూ ఉంటే ఎలాగ? మీరు అప్పులపాలవుతారు. అలాగే మీరు ఏదో సాధన చేసుకొంటున్నారు అనుకోండి, చేసే స్నేహాలు మంచివికాదు అనుకోండి, మీరు పాడైపోతారు, అసలు ఇతరులు అంటూ ఎవరూ లేరు అనేవారు భగవాన్. అందరి హృదయాలలో నువ్వే ఉన్నావు అది తెలియక నేను వేరు, అతను వేరు అనుకొంటున్నావు. దేహాభిమానం ఉన్నంతసేపు నేను వేరు, ఇతరులు వేరు అనే బుద్ధి నీకు పోదు. ఇతరులు అంటూ ఎవరూ లేరు అంటే ఇతరులు ఎవరికీ సహాయం చెయ్యవద్దు అని కాదు. ఇతరులకు నువ్వు ఏది చేస్తే అది నీకే తిరిగివస్తుంది. ఇతరులకు నువ్వు మంచి చేసావు అనుకో, నీకు నూటికి నూరుపాళ్ళు మంచి ఎదురువస్తుంది. నువ్వు ఇతరులకు చెడ్డ చేసావు అనుకో ఆ చెడ్డే నీకు ఎదురు వస్తుంది. ఎందుచేతనంటే ఇతరులలో కూడా నువ్వు ఆత్మరూపంలో ఉన్నావు. అందుచేత ఇతరులంటూ ఎవరూ లేరు. కుడిచేతిలో ఉన్నపండును ఎడమచేతిలో పెట్టుకొని త్యాగం చేసాను అనుకొంటాడా అనుకోడు, గర్వం తెచ్చుకొంటాడా గర్వం తెచ్చుకోడు ఎందుచేతనంటే కుడిచేయి తనదే, ఎడమచేయి తనదే. అలాగే అంతా తానే అని అర్థం చేసుకొని వాడు పనిచేస్తూ ఉంటే పని నిర్మలంగా అయిపోతుంది, అహంకారం రాదు, గర్వం రాదు. సబ్జక్టు తెలియకపోవటం వలన మనుషులకు గర్వం వస్తోంది కాని సబ్జక్టు తెలిస్తేవారికి గర్వం రాదు. నిజమైన గురువు నీ

హృదయంలోనే ఉన్నాడు. బయట గురువులు నీ లోపల ఉన్న నిజమైన గురువు దగ్గరకు నిన్ను పంపాలి, అలా పంపటానికి ప్రయత్నం చేయకపోతే వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు. నిద్రావస్థలో నుండి జాగ్రదవస్థలోనికి మీరు ఎలా మేలుకొంటున్నారో అలాగ బ్రహ్మ పదార్థంలోనికి మిమ్మల్ని మేల్కొలిపి అక్కడ ఉన్న జ్ఞానాన్ని, ఆనందాన్ని, శాంతిని మీకు అనుభవంలోనికి తీసుకొనివచ్చేవాడే గురువు.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ముందు మనకు సజీవమైన విశ్వాసం ఉండాలి. లోపల ఉన్న బ్రహ్మపదార్థమే భగవంతుడు. అది మన కళ్ళకు కనబడదు. కళ్ళకు కనబడని దానిని మనం పట్టుకోలేము. అందుచేత ఆ బ్రహ్మపదార్థమే ఒక రూపం ధరించి, కొన్ని గుణాలతోటి కొంతశక్తితోటి వస్తుంది. మనం నిర్గుణాన్ని పట్టుకోలేకపోతే ఈ సగుణాన్ని ఆరాధించాలి. ఏది నిజమో మనకు తెలియకపోయినా అవతారపురుషులకు తెలుసు. అవతారపురుషులను ఆరాధించటం వలన, ఆ నిజం దగ్గరకు తీసుకొని వెళ్ళేవరకు వారు మనలను విడిచిపెట్టరు. గురువుకు సేవచేసి, గురువును ధ్యానించి, గురువు మాటను భగవంతుడి మాటగా గుర్తించి ఆ రకంగా జీవించి బాగుపడినవారు చాలామంది ఉన్నారు. అయితే ఆ గురువు ఎలా ఉండాలి అంటే నిర్మలంగా ఉండాలి. నిశ్చలంగా ఉండాలి, రాగద్వేషములు లేకుండా ఉండాలి, వాడు ఏ బ్రహ్మం గురించి అయితే చెపుతున్నాడో దాని తాలుక అనుభవం వాడికి ఉండాలి, వాడు ఒక్కడు మాత్రమే ఇతరులను బాగుచేయగలడు. మిగతావారు అందరూ బోధగురువులు కాదు బాధగురువులు. మనం చేసే పని ఎలా ఉండాలి అంటే మనం బ్రాహ్మీస్థితి పొందటానికి అది మనకు సహకరించాలి. మనం రజోగుణంతోటి, తమోగుణంతోటి పనిచేస్తూ ఉంటే బ్రాహ్మీస్థితి మనకు దొరకదు. సత్వగుణంతో పనిచేస్తూ ఉంటే బ్రాహ్మీస్థితి పొందటానికి సత్వగుణంతో చేసిన కర్మ సహకరిస్తుంది. దేహం చనిపోతున్నప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాడు. అది ఫాల్స్ ఐ, అదే దేహగతమైన నేను, వాడే సైతాను. దానిలో నుండి విడుదలపొందకుండా లోపల బ్రహ్మపదార్థం ఉన్నా అది మీకు గోచరం కాదు. ఆ బ్రహ్మపదార్థం తాలుక ఎరుక మీరు పొందకుండా ఎన్నడూ మీరు ఆనందాన్ని పొందలేరు. ఈలోపుగా తాత్కాలికంగా మీకు శాంతిగా ఉన్నా రేపే అశాంతి వచ్చేయవచ్చు.

మన ఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి, అప్పడే చనిపోయారు అనుకొంటాము. కర్మసిద్ధాంతాన్నిబట్టి వారికి మనకు ఎంతవరకూ అనుబంధం ఉంటే అంత కాలం వారు మనతో ఉంటారు, తరువాత విడిపోతాము. దేహసంబంధాలు నిలబడేవికాదు. మనకు స్వప్నాలు వస్తాయి. స్వప్నంలో అనేక దేహాలు చూస్తాము, రైళ్లలో విమానాలలో తిరుగుతాము, ఆ దేహానికి సుఖం, దుఃఖం వస్తూ ఉంటాయి. మెలుకువ వచ్చాక అది అంతా అబద్ధం అని మనకు తెలుస్తుంది. స్వప్నంలో మీ మనస్సు తయారుచేసిన దేహాలు ఎటువంటివో మీకు జ్ఞానం కలిగాక ఈ దేహాలు కూడా అటువంటివే అన్న సంగతి అప్పడు మీకు తెలుస్తుంది గాని అంతవరకు ఎంత ప్రయత్నం చేసినా అది మీకు తెలియదు. మనం పని పనికోసమే చెయ్యాలి. వచ్చేది వస్తుంది రానిది రాదు. మనం ఫలితం కోసం ఎదురు చూస్తాము. ఎదురుచూస్తే ఎక్కువరాదు, మర్చిపోతే తక్కువ రాదు. మీ ప్రారబ్ధంలో ఏది ఉంటే అది మీకు భగవంతుడు కేటాయిస్తాడు. లోకంలో కనిపించే సంపద అంతా ఈశ్వరుడిదే. మొత్తం సంపద అంతా నీకు ఇచ్చేయడు, నీ దేహప్రారబ్ధంలో ఉన్నదే నీకు ఇస్తాడు.

మీరు సాధనలో అభివృద్ధిలోనికి రావాలంటే జరిగిపోయిన గొడవలు మర్చిపోవాలి. ఈరోజు చేతిలో ఉన్న పని ఈ రోజు చేయండి. భవిష్యత్ ఎలా ఉండాలో అది అలా ఉంటుంది కాని మీరు అనుకొన్నట్లుగా అది ఉండదు, దాని గురించి ఆలోచించి మీ మనస్సును పాడుచేసుకోవద్దు. మీరు ఏదైనా పొరపాటు చేస్తే పొరపాటు చేసాము, పొరపాటు చేసాము అని అస్తమానం అనుకోవద్దు. దానిని మరిచిపోయి, మీరు చేసిన పొరపాటుకు పశ్చాత్తాపం కనుక పడితే భగవంతుడు ఆ పొరపాటును నిశ్శేషంగా తీసేస్తాడు. అయితే మర్చిపోవటం చాలా కష్టం. మీరు పొరపాటును స్మరించటం కంటే నిరంతరం భగవంతుడిని స్మరించండి. అప్పడు ఆ పొరపాటు పోతుంది, దాని వలన వచ్చే ప్రమాదం కూడా పోతుంది. మీరు భగవంతుడిని ప్రేమించండి, మీ జీవితాన్ని ప్రేమించండి, మీరు ఎక్కువకాలం జీవించాలి అని అనుకోకూడదు, తొందరగా చనిపోవాలి అని అనుకోకూడదు. భగవంతుడు మనకు ఎంత ఆయుర్దాయం ఇస్తే అంత ఆయుర్దాయం ఆయనను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తూ శరీరం విడిచిపెట్టాలి. మన గమ్యం భగవంతుడే. భక్తి భక్తి కోసమే, భగవంతుడిని ప్రేమించటం కూడా ప్రేమించటం కోసమే ప్రేమించాలి. అప్పడు మనకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది. ఏదో ప్రయోజనాలకోసం భగవంతుడిని ప్రేమిస్తే ప్రయోజనం నెరవేరుతుంది

గాని ఆత్మజ్ఞానం కలుగదు.

మీరు ఇంట్లో వారికోసం ఎంతో కష్టపడి, పొరపాట్లు చేసి కోట్లకొలది డబ్బు సంపాదిస్తారు. వారికోసం ఎంతో డబ్బు సంపాదించిపెట్టాము అనుకొంటారు. ఈ దేహం చనిపోయాక మిమ్మల్ని ఎవరూ తలపెట్టరు సరికదా గది ఖాళీ అయ్యింది అని సంతోషిస్తారు, అది మాయ. మీరు సంపాదించిన కోట్లడబ్బు వారుఅనుభవిస్తారు. ఆడబ్బు సంపాదించటంలో మీరు చేసిన పొరపాట్లు మీ కూడా వచ్చేస్తాయి. అనుభవించేది ఇంట్లోవారు, పొరపాట్లు మటుకు జీవుడు మోసుకొనిపోతాడు. గురువు చేసేపని ఏమిటి అంటే ఆత్మజ్ఞానం గురించి బోధించటమే కాదు, ఆత్మానుభవం పొందాలి అనే తపన లోపలనుండి కలుగజేసి, ఆత్మానుభవం పొందేలా చేయాలి, వాడే నిజమైన గురువు. పని చెయ్యటం గుర్రంలాగ పనిచెయ్యి, బతకటం సన్యాసిలాగ బతుకు అని శాస్త్రంలో చెపుతారు అంటే నీ అవసరాలు పెంచుకోవద్దు. గురువు అనేవాడు ఆడంబరరహితంగా ఉండాలి, ఆయన మాటలోగాని, చేతలోగాని ఎక్కడా ఆడంబరం కనబడకూడదు అని రామకృష్ణుడు చెప్పాడు. అరుణాచలం అంటే అక్కడ శివదేవుడా, బ్రహ్మదేవుడా, విష్ణుదేవుడా అని కాదు. మన హృదయంలో ఏ బ్రహ్మపదార్థం అయితే ఉందో, ఏ సత్యపదార్థం అయితే ఉందో అదే అక్కడ రూపం దాల్చింది. మనం రమణభగవాన్ గురించి ఎక్కువగా అరుణాచలం వెళుతున్నాము కాని కొంతమంది కేవలం అరుణాచలేశ్వరుడికే భక్తులు. ఈ కొండమీద శివుడు ఉండటం కాదు ఈ కొండే శివుడు అన్నారు భగవాన్. మీరు అరుణాచలం వెళ్ళినప్పుడు ఆ కొండవంక అలా చూస్తూ ఉండండి, మీకు దేవతలు ఎవరూ స్ఫురించరు మీ హృదయంలో ఉన్న వస్తువే మీకు స్ఫురిస్తుంది. మీ ఇంటి దగ్గర అరుణాచలం బొమ్మలు ఉంటే ఆ బొమ్మవంక అలా చూస్తూ ఉండండి, మీ మనస్సు హృదయగుహలోనికి వెళ్ళిపోతుంది అయితే ఆ విశ్వాసం మనకు ఉండాలి. జీవుడికి దేవుడికి తేడా ఏమీ లేదు, వేషమే తేడా. దేహంతో తాదాత్మ్యం పొందే బుద్ధి కనుక పోతే జీవుడు దేవుడు ఒక్కటే, ఒక్కటంటే ఒక్కటే. నేను నా తండ్రీ ఒక్కటే అని ఏసుక్రీస్తు చివరిలో అంటాడు. అంతవరకు తండ్రి గురించి బోధిస్తాడు, తండ్రి ఆజ్ఞలను పాటించమని చెపుతాడు.

బ్రాహ్మీస్థితి కలిగేవరకు మీరు దేవుడికి నౌకరుగా ఉండండి అని రామకృష్ణుడు చెపుతాడు. దేవుడు యజమాని, మీరు నౌకరులు అనుకొని బతకండి, అమృతానుభవం

కలిగేవరకూ అది తప్పదు. ఈ లోకం అంతా దుఃఖంతో నిండి ఉంది, ఈ దుఃఖంలో నుండి బయటపడాలంటే ఎలాగ అని అడుగుతున్నాడు దానికి రకరకాల మందులు లేవు, నువ్వు బ్రాహ్మీస్థితిని పొందటం తప్పించి ఇంకో ఉపాయం లేదు. మీకు డబ్బు లేనప్పుడు డబ్బు వస్తే సుఖంగా ఉండవచ్చు అని అనిపిస్తుంది, మీకు ఏదైనా కోరిక ఉంటే అది నెరవేరినప్పుడు శాంతిగా ఉన్నట్లు అనిపిస్తుంది, ఇది అంతా తాత్కాలికమే. బ్రాహ్మీస్థితిని పొందేవరకు దుఃఖంలేని స్థితిని ఎవడూ పొందలేడు, ఇంకో మార్గం లేదు, నువ్వు కష్టపడి సాధన చేసి బ్రహ్మానుభవం పొందవలసిందే. ఒక్క బ్రహ్మపదార్థం తప్పించి మిగతావన్నీ కల్పనే. నువ్వు కల్పనలో ఉన్నంతకాలం దుఃఖం లేని స్థితిని ఎలా పొందగలవు. నువ్వు కల్పించుకొన్న గొడవలలో నుండి మనస్సు విడుదల పొందాలి, మనం కల్పించుకొన్న గొడవలలో నుండి మనస్సును తప్పిస్తే అది వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. మేము ఒంటరిగా ఉండలేక పోతున్నాము అని కొంతమంది అంటూ ఉంటారు. మరి చనిపోయాక మీ కూడా పదిమంది వస్తారు అనుకొంటున్నారా? మీకు భక్తి లేక అలా అనిపిస్తోంది. ఒంటరిగా ఉండటం ఏమిటి? మీకు దేవుడు లేడా? దేవుడు లేకుండా నువ్వు ఉన్నావా? చనిపోయాక నీకు జత ఎవరు వస్తారు? మన ఇంట్లోవారు మనలను రక్షిస్తారు, మన డబ్బు మనలను రక్షిస్తుంది, మన స్నేహితులు మనలను రక్షిస్తారు అని ఇలా అనుకొంటున్నాముగాని దేవుడు మనలను రక్షిస్తాడు అనే బుద్ధి మనకు రావటం లేదు. ఒక్కటి గుర్తు పెట్టుకోండి. ఈ గుళ్ళు, గోపురాలు, పూజలు ఇవన్నీ మనస్సు యొక్క కల్పితం. మన కంట్రోలర్, మన యజమాని మన హృదయంలోనే ఉన్నాడు. వాడు ఒక్కడే నిజం, మిగతావి అన్నీ కల్పితం. అయితే మనకు దేహబుద్ధి ఉంది కనుక ఈ గుళ్ళు, గోపురాలు ఏర్పాటు చేసారు. నిన్ను శాసించేవాడు, మీ దేహప్రారబ్ధాన్ని బట్టి మిమ్మల్ని నడిపించేవాడు ఎక్కడో వైకుంఠంలో లేడు, మీ హృదయంలోనే ఉన్నాడు, వాడు శాసించినట్లు జరిగిపోవలసిందే. మీ హృదయంలో ఉన్న నిజాన్ని మీరు తెలుసుకొనే వరకూ నిజంకానిదానిలోనుండి బయటకు వచ్చే అవకాశం లేదు. గురువులు వేరు, పరమగురువులు వేరు. మీరు గమ్యాన్ని వదిలేసినా, మీరు తాత్కాలికంగా ఏవో గొడవలతో ఇబ్బందులు పడుతున్నా, ఆ గొడవలలో కలిసిపోకుండా వాటిలో నుండి మిమ్మల్ని విడుదలచేసి, మీ మనస్సును గమ్యం వైపుకు తిప్పి, ఏ వస్తువునైతే మీరు పొందాలో ఆ వస్తువు తాలుక అనుభవాన్ని మీకు కలుగజేసేవాడే పరమగురువు.

మంచివారిమీద మనకు ఏదైనా ద్వేషం ఉంది అనుకోండి, వారి మంచితనం మనం మిస్అయిపోతాము. మనలో ఉన్న ద్వేషం వలన వారి మంచితనంగాని, వారిలో ఉన్న ఔన్నత్యంగాని మనకు కనబడదు. బయట ఉన్న శత్రువులను జయించటం తేలిక, లోపల ఉన్న శత్రువులను జయించటం కష్టం. అరిషడ్వర్గాలు అంటే ఆరు శత్రువులు మీ లోపల ఉన్నారు. వాటిని తొలగించుకోకుండా మనం ఎంత ప్రయత్నం చేసినా మనకు ఆత్మజ్ఞానం కలుగదు, అవి మనకు అడ్డువచ్చేస్తాయి. వల్లకాటిలో మన శరీరం కాలిపోయినప్పడు అవి కాలిపోవు, వచ్చేజన్మలో కూడా మన కొంపముంచటానికి వచ్చేస్తాయి. కోరిక, కోపం, లోభిత్వం, మోహం, మదము, మాత్సర్యము వీటిని తొలగించు కోకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. కోరికలు ఎలా ఉంటాయి అంటే ఏది చూస్తే అదే మనకు కావాలని అనిపిస్తుంది. వాడికి 10 గడ్డిమేట్లు ఉన్నా మరల గడ్డిమేటు కనబడితే అది కూడా తనకే కావాలి అంటాడు అంటే అంతా నాకే కావాలి. లోభిత్వం ఎలా ఉంటుంది అంటే వెయ్యికోట్ల డబ్బు ఉన్నవాడు కూడా ఏమీ లేనట్లు ఏడుస్తూ ఉంటాడు. వారికి ఉన్నది తినరు, ఎవరికి పెట్టరు. కొంతమంది లోభిత్వం చూస్తే అసలు భరించలేము, దానికి అంతు ఉండదు. లోభిత్వం ఉన్న మనిషి ఎప్పడైనా పొరపాటున మీకు ఐదు రూపాయలు ఇచ్చాడు అనుకోండి ఇంక వారి సంపద అంతా పోయినట్లు, ఏవో రాజ్యాలు పోయినట్లు బిగిసిపోతారు. మోహం ఉంటే మంచిని చెడ్డ, చెడ్డను మంచి అనుకొంటాడు. లోకం అసత్యం అయినప్పటికి మనలో ఉన్న మోహం కారణంగా అది సత్యం కింద మనకు అనిపిస్తుంది. మదము అంటే గర్వం. రామకృష్ణ పరమహంసగారు చెప్పేవారు ఇప్పడేముంది పదివేల రూపాయల పట్టుచీర కట్టుకొనిచూడు అప్పడు నీకు ఎంత పొగరుబోతుతనం ఉందో తెలుస్తుంది. మీలో అంతర్గతంగా గర్వం ఉంటుంది, ఆ పట్టుచీర మీ లోపల ఉన్న మదాన్ని బయటకు తీసుకొని వస్తుంది.

రామకృష్ణ పరమహంసగారి దగ్గరకు వచ్చి వారికి డబ్బు లేనప్పడు నమస్కారం పెట్టినవారు, వారికి ఏదైనా కలిసివచ్చి డబ్బు బాగా వచ్చింది అనుకోండి, ఏమయ్యా పంతులు బాగున్నావా అనేవారట రామకృష్ణ పరమహంసను కలిసినప్పడు. అలా మాట్లాడటం చూసి అక్కడ ఉన్న శిష్యులకు కోపం వచ్చేది. అప్పడు రామకృష్ణుడు చెప్పేవాడట వాడు మాట్లాడటం లేదు, వాడి దగ్గరఉన్న ధనం మాట్లాడిస్తోంది అని. ధనం, పాండిత్యం పెరిగే కొలది వాటిని

నిగ్రహించు కోకపోతే ఎందుకు పనికిరాకుండా పాడైపోతాము. మాత్సర్యం అంటే అసూయ. సర్వసాధారణంగా చాలామందిలో అసూయ ఉంటుంది. నలుగురు అక్కాచెల్లెళ్ళు ఉన్నారు అనుకోండి అందులో ఒకరి పరిస్థితి బాగా ఉంటే అది చూసి మిగిలిన వారికి అసూయ వచ్చేస్తుంది. వారి పని బాగోవటం మంచిదే ఎప్పుడైనా మనకు సహాయం చేస్తారు అనే బుద్ధి మనకు ఉండదు, బాగా ఉన్న ఆవిడని చూసి మిగిలిన వారు అసూయ పడతారు. అసూయకు పెట్టుబడి అక్కరలేదు, తొందరగా వచ్చేస్తుంది. ఈ శత్రువులు లోపలే ఉన్నారు, వారు కొన్ని లక్షల సంవత్సరాల నుండి మీ కూడా వస్తున్నారు. అందుచేత ఒక్క రోజులో పొమ్మంటే పోరు. నువ్వు సాధన చెయ్యాలి, గురువు యొక్క అనుగ్రహం ఉండాలి. అవి ఎప్పుడు పోతాయి అని కనిపెట్టుకొని ఉండకూడదు, మీరు నిరంతరం భగవంతుడిని స్మరించుకొంటూ ఉంటే, భగవంతుడు చెప్పిన మాటలయందు మీరు గౌరవం కలిగి ఉంటే, ఆయన చెప్పినట్లు మీరు జీవిస్తూ ఉంటే వాటంతట అవే బయటకు పోతాయి కాని బలవంతంగా మీరు గెంటితే అవి బయటకు పోవు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 18-07-08, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గురుపూర్ణిమ. మన భారతీయ సంస్కృతికి, సాహిత్యానికి మూలమైన వేదవ్యాసుడి యొక్క పుట్టినరోజును గురుపూర్ణిమగా జరుపుకొంటారు. మన సంస్కృతి అంతా వాల్మీకి, వేదవ్యాసుడు వీరిద్దరిమీద డిపెండ్ అయి ఉంది. రామాయణం యొక్క రచయిత వాల్మీకి మహర్షి, మహాభారతం యొక్క రచయిత వేదవ్యాస మహర్షి. ఈ రెండు కావ్యాల వలన మనకు అంతర్జాతీయంగా ఖ్యాతి కలిగింది. మన కుటుంబ జీవితం ఎలా ఉండాలి, సామాజిక స్పృహ ఎలా ఉండాలి, మన జీవితవిధానం గురించి ఈ ఇద్దరు మహర్షులు చాలా వివరంగా చెప్పారు. వ్యాసమహర్షి వేదాలను విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. వేదం అంటే జ్ఞానం. వేదంలో లేనిదంటూ ఏమీ లేదు. వేదంలో పరావిద్య, అపరావిద్య ఉన్నాయి. మనకు మొదటి గురువు దక్షిణామూర్తి, ఆయన మౌనంగానే ఆత్మవిద్యను బోధించాడు. మౌనం కూడా మాట్లాడుతుంది, అది చాలామందికి తెలియకపోవచ్చు. దక్షిణామూర్తి మౌనం అందరికీ అర్థంకాదు. దక్షిణామూర్తి

శిష్యులు అందరూ బాగా బుద్ధిసూక్ష్మత ఉన్నవారు కాబట్టి ఆయన మౌనాన్ని అందుకొన్నారు. ఈ గురుపరంపరలో మొదట దక్షిణామూర్తి, తరువాత వ్యాసుడు, కొన్నివందల సంవత్సరాల తరువాత శంకరుడు వచ్చాడు. దక్షిణామూర్తిలాగ మౌనంగా కూర్చొంటే సమాజం అర్థం చేసుకొనే పరిస్థితిలో లేదు అని శంకరాచార్యులవారు ఉపనిషత్‌లకు వ్యాఖ్యానం వ్రాసి దేశమంతా మూడుసార్లు కాలి నడకన తిరిగి ఉపనిషత్‌లసారాన్ని, భగవద్గీతను, విష్ణుసహస్ర నామాలను ప్రజలలో ప్రచారం చేసారు.

ఆచార్యులు మనకు జీవనదిలాంటివారు. వారు ఏదైతే మనకు చెపుతున్నారో ఆ ప్రకారం జీవించి, ఇతరులకు బోధించి వారి అవగాహనకు అందేటట్లు చేస్తున్నారు కాబట్టి మన సంస్కృతి, ఈ తత్వశాస్త్రం ఇలా జీవనదిలా ప్రవహిస్తోంది. అయితే గురువులు కేవలం ఆత్మజ్ఞానం గురించి బోధించటమే కాదు వారికి ధర్మశాస్త్రం గురించి, లోకవిద్య గురించి కూడా బాగాతెలుసు, మహర్షులు అంతా బహుముఖ మేధావులు. వారికి ఆత్మవిద్య గురించి మాత్రమే తెలుసు అని మనం అనుకొంటాము కాని వారికి అన్ని విద్యలు తెలుసు, అయితే ఆ కాలాన్నిబట్టి దేనికైతే ప్రాముఖ్యత ఇవ్వాలో దానికి ప్రాముఖ్యత ఇస్తూ ఉంటారు. ఈ భారతీయ తత్వశాస్త్రం గురించి, భారతీయ సంస్కృతి గురించి, భారతీయ జీవిత విధానం గురించి సమగ్రంగా తెలియాలి అంటే ప్రస్థానత్రయం అంటే భగవద్గీత, ఉపనిషత్‌లు, బ్రహ్మసూత్రాలు ఇవి మూడూ అధ్యయనం చెయ్యాలి. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే జీవుడు వేరు, దేవుడు వేరు కాదు. జీవుడు ప్రతిబింబం మాత్రమే. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అది మీ హృదయంలోనే ఉంది. మీరు లోపల ఉన్న వస్తువును ధ్యానం చేస్తే, మీకు లోచూపు కలిగితే దాని తాలుక ఎరుక మీకు కలుగుతుంది. దేహం లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో వైకుంఠంలో దేవుడు ఉన్నాడు అని మనం అనుకొంటాము, ఇది మన అజ్ఞానానికి గుర్తు. నేను, ఈలోకం, దేవుడు ఈ మూడు కలిపి ఒక ముద్ద అయిపోవాలి, అప్పుడు వాడికి లోపల ఉన్న వస్తువు తాలుక అనుభవం కలుగుతుంది. జ్ఞానం అంటే ఏమిటి అని రామకృష్ణుడిని అడిగారు. మనం నేను, నేను అంటాము కదా. ఆ నేను, నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. నిజం నీకు తెలిసేవరకూ నిజంకానిదానిని నిజం అనుకోవటం మానవు అని శాస్త్రంలో చెప్పారు. మనం ఏది కాదో అది అవును

అనుకోవటం వలన మనకు కర్తృత్వం వస్తోంది. మేము అది సాధించాము, ఇది సాధించాము అని చాలామంది అంటారు. సాధించటానికి మీరు ఎవరు? మీ మనస్సు సాధించిందా? మీరు అందరూ బొమ్మలు, మీరు అందరూ యంత్రాలు. మీ అందరి హృదయాలలో అంతర్యామిగా డ్రైవర్‌ను నేను ఉన్నాను. బొమ్మలను ఆడించేవాడు బొమ్మను ఎలా ఆడిస్తాడో అలాగ మీ ప్రారబ్దాన్ని అనుసరించి మిమ్ములను ఆడిస్తున్నాను అని పరమాత్మ గీతలో చెప్పింది మనం అర్థం చేసుకోవాలి.

భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి ఏమని అడిగారంటే దేవుడు ఉంటే నాకు కనబడాలి కదా, నా కళ్లకు ఎందుకు కనబడటం లేదు అన్నాడు. భగవాన్ ఏమన్నారు అంటే ఏరా అబ్బాయి నీకు అసలు బుద్ధి ఉందా అన్నారు. అంటే వాడికి కోపం వచ్చి నాకు బుద్ధి లేకపోవటం ఏమిటి అన్నాడు. అయితే నీ బుద్ధిని నాకోసారి చూపించు అన్నారు. నా కళ్లకు చూపించలేవు అయితే నీకు బుద్ధి లేదు అంటావా? మన కళ్లకు కనిపించనంతమాత్రంచేత, మన ఇంద్రియాలకు అందనంత మాత్రం చేత దేవుడు లేడు అని కాదు. సత్యం అనేది నీ బుద్ధితో అర్థం చేసుకొనేది కాదు. నీ బుద్ధి ఎక్కడైతే లయమైందో, నీ మనస్సు ఎక్కడైతే లయమైందో అక్కడ సత్యం నీకు వ్యక్తమవుతుంది. మనందరం పవిత్రులం, బుద్ధిమంతులం అని మనం అనుకోవచ్చు. కాని మనం బుద్ధిమంతులం, పవిత్రులం అని దేవుడు అనుకొంటే అప్పుడు ఆయన మనకు వ్యక్తమవుతాడు కాని మనం అనుకొన్నంతమాత్రం చేత ఆయన మనకు తెలియబడడు. అనేకమంది సాధనలు చెయ్యవచ్చు, భగవంతుడిని తెలుసుకోవటానికి ప్రయత్నాలు చేయవచ్చు అయినా ఆయన తెలియబడడు. ఆయన ఎవరికి తెలియబడాలి అనుకొన్నాడో, ఆయన అనుగ్రహానికి ఎవడైతే పాత్రుడయ్యాడో వాడికి మాత్రమే ఆయన తెలియబడతాడు. మన కోరిక వలన జ్ఞానం రాదు, ఈశ్వరానుగ్రహం వలన మనకు జ్ఞానం కలుగుతుంది. అయితే ఆయన అనుగ్రహం మనకు ఎప్పుడు వస్తుంది? ఆయన మాటయందు గౌరవంకలిగి, ఆయన వద్దని చెప్పిన పనిని మానివేసి, ఆయన చేయమని చెప్పిన పనులు చేస్తూ, ఆయన చెప్పిన విధంగా మనం జీవిస్తూ ఉంటే కొంతకాలానికి మనం పరమపవిత్రులమవుతాము, అప్పుడు దేవుని అనుగ్రహం మనకు వస్తుంది. బ్రహ్మ విద్య సంపాదించటానికి మీరు ఒక్క అడుగువేస్తే, మీరు వేసిన అడుగు సిన్సియర్‌గా కనుక

ఉంటే భగవంతుడు తొమ్మిది అడుగులు ముందుకు వేసి ఆయన మీకు వ్యక్తమవుతాడు అని రామకృష్ణుడు చెప్పాడు.

మీరు ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా కూర్చోండి. మీకు మంచితలంపులు రానివ్వండి, చెడుతలంపులు రానివ్వండి మీకు ఏ తలంపు వచ్చినా దానికి దేహమే కేంద్రం అవుతుంది. ఈ తలంపు నాకు ఎందుకు వస్తోంది అని పరిశీలన చేసి చూస్తే అది తిరిగి తిరిగి దేహం దగ్గరకు వస్తుంది. మనం అందరం నూటికి నూరుపాళ్ళు స్వార్థపరులం. సృష్టిలో పాపం అంటూ ఏదైనా ఉంటే స్వార్థమే పాపం. వాడు ఏ మతంలో ఉన్నా సృష్టిలో ఇంతవరకూ ఏ స్వార్థపరుడికి ఆత్మజ్ఞానం కలుగలేదు. మనకు జ్ఞానం రాకుండా ఎవరో ఇతరులు అడ్డువస్తున్నారు అని మనకు అనిపిస్తుంది కాని ఇతరులు ఎవరూ అడ్డురావటం లేదు, మనలో ఉన్న అజ్ఞానం, మనలో ఉన్న జీవలక్షణాలు, మనలో ఉన్న స్వార్థమే మనకు అడ్డువస్తోంది. ఏసుక్రీస్తు దగ్గరకు ఒకడు వచ్చి మీ మాటలను నేను ఇష్టపడుతున్నాను, మిమ్మల్ని వెంబడించాలి అని ఉంది అని చెప్పాడు. అబ్బాయి నీకు ప్రోపర్టీ ఉందా అని ఏసు అడిగాడు, ఉంది అని చెప్పాడు. ఏ గ్రామంలో అయితే నీకు ప్రోపర్టీ ఉందో అది అంతా అక్కడ ఉన్న బీద ప్రజలకు పంచి పెట్టేసి అప్పుడు నన్ను వెంబడించు అని చెప్పాడు. వాడు మళ్ళీ కనబడకుండా వెళ్ళిపోయాడు. అంటే మనం అందరం తెలివిగలవారము. మన అలవాట్లు విడిచిపెట్టకూడదు, స్వార్థం విడిచిపెట్టకూడదు, బేదబుద్ధి విడిచిపెట్టకూడదు, రాంగ్ బిహేవియర్ విడిచిపెట్టకూడదు మనకు దేవుడు తెలిసిపోవాలి. దేవుడు మనం అనుకొన్నంత అమాయకుడు కాదు, ఆయన సర్వజ్ఞుడు. మనం ఏమనుకొంటున్నామో ఆయనకు తెలుసు. మనలో ఉన్న బలహీనతలు అవి తలంపు రూపంలో వస్తేనేగాని అవి మనలో ఉన్నట్లు కూడా మనకు తెలియదు. మనకు తలంపు రాకముందే మనలో ఉన్న బలహీనతలు ఏమిటో భగవంతుడికి తెలుసు. రామకృష్ణుడు, రమణుడు, స్వామీజీ వీళ్ళు ఉపనిషత్తులలోని సారాన్ని చిన్న చిన్న మాటలలో చెప్పగలిగారు. అయితే మనం ఏమి చేస్తున్నాము అంటే వారితోటి అతి పరిచయం వలన ఈ మోడరన్‌గా వచ్చిన మహర్షులను మనం మిస్ అయిపోతున్నాము.

సాంప్రదాయంగా ఎవరి గురువును వారు ఆరాధించుకోవటానికి గురుపౌర్ణమి

ఏర్పాటుచేసారు. గురుశిష్య సాంప్రదాయం సనాతనంగా వస్తోంది. ముందు మనం గురువును గౌరవించాలి, గురువుకు ఎంతో కొంత సేవ చెయ్యాలి. గురువును ఏదైనా అడిగేటప్పుడు హేళనగా అడగకూడదు, చాలా మర్యాదగా, వినయంతో, తెలుసుకోవాలనే కాంక్షతో అడగాలి. గురువు సమానబుద్ధి కలిగి ఉండాలి. వాడు ధనవంతుడు వీడు పేదవాడు, వాడు పండితుడు వీడు పామరుడు అని చూడకుండా అందరిలో ఒకే వస్తువును చూడగలగాలి. ఆచార్యులవారి నలుగురు శిష్యులలో ఒకడికి అండర్‌స్టాండింగ్ తక్కువ. మిగతాముగ్గురు గురువుగారితో వాడి గురించి మాకు టైము వేస్టు, వచ్చినా వాడికి అర్థం కాదు కాబట్టి వాడిగురించి చూడవద్దు మీరు పాఠం మొదలుపెట్టండి అనేవారు. గురువుకు అంతా సాధ్యమే. వాడికి చదువురాదు అని మిగతావారు అవమానపరుస్తున్నారు అని ఆయన అనుగ్రహం వాడికి ఇచ్చేసాడు, ఆ రోజున వాడు వచ్చేటప్పటికి కవిత్వం చెప్పకొంటూ వచ్చేస్తే మిగతా ముగ్గురు నివ్వెరపోయారు. గురువు అనుగ్రహానికి అన్నీ సాధ్యమే. గురువును అడిగేటప్పుడు గౌరవంగా అడగాలి. ఎప్పుడైతే నువ్వు గౌరవంగా ఉన్నావో గురువు కూడా తన హార్ట్ ఓపెన్‌చేసి చెపుతాడు. నీకు సబ్జక్టు చెప్పటమేకాదు, దానిపట్ల జిజ్ఞాస కలుగజేస్తాడు, జిజ్ఞాస కలుగజేయటమే కాదు ఏ వస్తువు గురించి అయితే తను చెపుతున్నాడో ఆ వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చేవరకూ నిన్ను వెంటాడతాడు, వాడు గురువు. గురువు అంటే శరీరం కాదు, గురువు అంటే ఆత్మ. అందుచేత ఈ శరీరం పోయినప్పుడు బంధువులతోటి, స్నేహితులతోటి సంబంధం తెగిపోతుంది కాని గురువుతో సంబంధం తెగదు. గురువు ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని మనం పొందేవరకు ఆయన మనలను వెంటాడుతూనే ఉంటాడు. భౌతిక ప్రేమలలో అన్ని ప్రేమలకంటే తల్లి ప్రేమ గొప్పది కాని గురువు చూపించే ప్రేమతోటి తల్లిప్రేమ కూడా సరికాదు. మీకు గురువుతో ఉన్న అనుబంధం కేవలం ఒక జన్మకు సంబంధించినది కాదు. భగవాన్ దగ్గరకు ఎవరైనా కొత్తవారు వచ్చి కూర్చొంటే వీరెవరు, వీరెవరు అని అక్కడ ఉన్నవారు అడిగేవారట. ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు, మన వాళ్ళే కాబట్టి మన దగ్గరకు వచ్చారు అనేవారు భగవాన్. గురువు వేరు, దేవుడు వేరు కాదు. నీకు ఉన్న జ్ఞానకాంక్ష నిజమైతే, జ్ఞానం కోసం నీవు భగవంతుడిని ఆరాధిస్తూ ఉంటే నీవు ఆరాధించే దేవుడే గురురూపం ధరించి వస్తాడు.

మనకు ఎప్పుడైనా దుఃఖం వస్తోంది అనుకోండి, అశాంతి వస్తోంది అనుకోండి దానికి మా అత్తగారు కారణం, మా కోడలు కారణం, నా భార్య కారణం అని ఇలా ఏవో నెపాలు చెపుతాము. నా అశాంతికి, నా దుఃఖానికి నేనే కారణం అన్న సంగతి నాకు తెలియటం లేదు. నాకు దుఃఖం రావటానికి నా అజ్ఞానమే కారణం, నా స్వార్థమే కారణం, దేహగతమైన నేనే కారణం తప్ప నా కుటుంబసభ్యులు కారణం కాదు. నీ దుఃఖకారణం బయట లేదు, అది నీ లోపలే ఉంది, కర్తృత్వరూపంలో ఉంది. గురువు చేసే పని ఏమిటి అంటే మనలను తలువు సందున పెట్టి నొక్కుతాడు. మనలో ఉన్న బలహీనతలను బయటకు కక్కించటం కోసం మనలను కష్టాలమధ్యన పెడతాడు, అది మన మీద ఇష్టం లేక కాదు, దానివలన మనం కొన్ని పాఠాలను నేర్చుకోవాలి. ఆ పాఠాలు నేర్చుకొంటే కాని మనకు బుద్ధి రాదు. మన హృదయంలో ఒక నిజం ఉంది అని మనకు తెలిస్తే, ఆ గుర్తింపు మనకు వస్తే దానిని తెలుసుకోవటానికి మనం ప్రయత్నం చేస్తాము. మన హృదయంలో ఒక నిజం ఉందనే గుర్తింపు కూడా అసలు మనకు రావటం లేదు, అంత స్థూలబుద్ధి మనది, ఇంక తెలుసుకోవటానికి ఏమి ప్రయత్నం చేస్తాము. ఆ గుర్తింపు రావటానికే మహాత్ముల, మహర్షుల దర్శనం. గురువు చేసేది అంతా ఇన్నర్ వర్క్. వాడు కళ్ళు మూస్తే వాడిని వాడు చూసుకొంటాడు, కళ్ళు తెరిస్తే వాడిలో ఉన్నది మనకు చూపించటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. మనం ప్రతీదానికి నేను, నేను అంటాము, ఈ నేనును మనం నీళ్ళకంటే ఎక్కువగా వాడతాము. మనం ఇంపెర్సనల్‌గా మాట్లాడాలి, మన బిహేవియర్ ఇంటెలిజెంట్‌గా ఉండాలి, ఇంపెర్సనల్ బిహేవియర్ అయి ఉండాలి. మన మాటలో, చేతలో, వ్యవహారాలలో ఆ నేనును కలుగజేసుకోనివ్వవద్దు. అప్పుడు ఆ నేనుకు ఫుడ్ సప్లయి కట్ అయ్యి, దాని అంతట అదే సన్నగిల్లిపోతుంది. మనం సాధన చేసి విడిచిపెట్టవలసినవి ఏమిటి అంటే ఇష్టాలు, అయిష్టాలు, ఎటాచ్‌మెంట్లు. ఎటాచ్‌మెంట్ వలననే మనకు నాన్‌సెన్స్ అంతా వస్తోంది. సారా తాగటం, సిగరెట్ కాల్చటం పాపంకాదు అసలు ప్రపంచంలో పాపం అంటూ ఏదైనా ఉంటే ఎటాచ్‌మెంటే పాపం. ఎటాచ్‌మెంట్‌కు మించిన పాపం లేదు. ఎటాచ్‌మెంట్ వలననే మనం తప్పలు చేస్తాము. ఎటాచ్‌మెంట్ ఉన్నవాడు పాపం చేయకుండా ఉండలేడు.

సైన్సు మన దేహానికి కంఫర్టు ఇస్తుంది గాని మైండ్‌కు కంట్రోలు ఇవ్వలేదు. ఒక్క

దేహానికి కంఫర్టు వల్లే నువ్వు సుఖపడలేవు. ఉండటానికి గూడు, తినటానికి తిండి ఉన్నంతమాత్రంచేత నీవు సుఖపడలేవు. ఇంక నువ్వు తెలుసుకోవలసింది ఉంది. నీ హృదయంలో సత్యం ఉంది, దానిని తెలుసుకొనేవరకు నీకు సుఖం లేదు, శాంతి లేదు. నువ్వు సత్వగుణాన్ని అలవర్చుకో. సత్వగుణాన్ని అలవర్చుకొంటే అది సత్యాన్ని తెలుసుకోవటానికి మార్గం చూపిస్తుంది. సత్వగుణం ఉన్నవాడికి యాక్షన్ ఎక్కువగా ఉంటుంది, రియాక్షన్ తక్కువగా ఉంటుంది. సత్వగుణం ఉన్నవాడు పని చేసుకొంటూపోతాడు, వచ్చేది వస్తుంది, రానిది రాదు, వచ్చినదాని గురించి పొంగిపోడు, రానిదానిగురించి కుంగిపోడు, వారికి ఏమీ ఆశింపు ఉండదు. రజోగుణం ఉన్నవాడు ఆశింపు లేకుండా ఏ పనిచేయడు. కొన్నికొన్ని కార్లు పది మైళ్ళ స్పీడులో వెళితేనే ఓరు, ఓరు, ఆ కారులో మనం కూర్చోలేము. మనం ఇలా డొక్కు కార్లకింద తయారయ్యాము. అల్లరి ఎక్కువ, గోల గోల, పని మాత్రం సున్నా. గురువు శరీరం, మన శరీరం దగ్గరగానే ఉంటాయి కాని లోపలకు వెళ్ళి చూస్తే వారికి మనకు పోలిక లేదు, ఆయన ఎక్కడో ఉంటాడు, మనం ఎక్కడో ఉంటాము. గురువు చేసే పని ఏమిటి అంటే ఆయన మనతో చనువుగా ఉంటూ, మనతో కలిసి తిరుగుతూ, మనతో మాట్లాడుతూ, మనకు తెలియకుండా మనలో ఉన్న బలహీనతలను తొలగించి, ఆయన ఏ స్థితిలో అయితే ఉన్నాడో ఆ స్థితికి మనలను తీసుకొనిపోతాడు, వాడు గురువు. ఒక శరీరం పుట్టింది అంటే చనిపోయితీరుతుంది, వాడు చనిపోయాడు అంటే తిరిగి పుడతాడు. ఇప్పుడు మనందరం పుట్టాము పుట్టాము అనుకొంటున్నాము కదా. ఎవరు పుట్టారు? దేహం పుట్టింది. అంటే చనిపోయే దేహంతో మనకు అనుబంధం ఉంది కాని చావులేని సత్యపదార్థంతో మనకు అనుబంధం లేదు. అందుచేత నేను పుట్టాను అనుకొనేవాడు తప్పనిసరిగా చనిపోతాడు, నేను చనిపోతున్నాను అనుకొనేవాడు తప్పనిసరిగా తిరిగి పుడతాడు. భగవాన్ ఏమన్నారు అంటే నీ శరీరం పుట్టినప్పుడు నువ్వు పుట్టలేదు అందుచేత నీ శరీరం మరణించినప్పుడు నువ్వు మరణించవు అని చెప్పారు.

మనందరికీ చనిపోవాలని ఉందా? ఉండాలని ఉందా? అందరికీ ఉండాలనే ఉంది, ఎవరికీ చనిపోవాలని లేదు. ఆ ఉండటమే దేవుడు. దేవుడు అంటే రాముడని, కృష్ణుడని, అల్లా అని, క్రీస్తు అని కాదు, ఇవి అన్నీ మన ఉపాసన కోసం పెట్టుకొన్నాము. నీకు

రోగం లేనప్పుడు డాక్టరుతో పనిలేదు. అలాగే నీలో బలహీనతలు లేనప్పుడు దేవుడితో పనిలేదు అన్నాడు ఐన్‌స్టీన్. మీలో ఏదో వెలితి ఉన్నప్పుడు, మీలో ఉన్న బలహీనతలు మీ మనస్సును పాడుచేస్తున్నప్పుడు వాటిలో నుండి విడుదల చెయ్యమని ప్రార్థించటానికి నీ మనస్సు ఒక దేవుడిని తయారుచేసింది. అయితే దేవుడు అబద్ధమా అంటే అబద్ధంకాదు, నీ మనస్సు ఎంత నిజమో ఆయన కూడా అంతే నిజం. నువ్వు ఏదో పని చేస్తావు, దానికి ఫలితం ఇచ్చేవాడు ఒకడు ఉండాలి, వాడే దేవుడు. దేవుడు ఇలా చేసాడు ఏమిటి, అలా చేసాడు ఏమిటి అని కొంతమంది అంటారు. దేవుడు ఏమి చేయలేదు, నీవు చేసిందే నీకు ఇస్తాడు. జన్మాంతరంలో నుండి వచ్చిన బలహీనతలు మనలో ఉంటాయి. గురువు చేసే పని ఏమిటి అంటే ఒకో బలహీనతను బయటకు లాగి కాల్చిబూడిద చేస్తాడు. ఒకోసారి నువ్వు ఏదైనా కోరిక కోరుకుంటే ఆ కోరిక నెరవేరటం వలన నువ్వు పాడైపోతావు అనుకొంటే ఆ కోరిక నెరవేరకుండా ఆపుచేస్తాడు. నా గురువు నన్ను వదిలేసాడు ఏమిటి అని నువ్వు అనుకొంటావు, అప్పుడు గురువు మీద కోపం వస్తుంది. నీ లోపల కోపం ఎంత ఉందో చూపించటానికి ఇవన్నీ చేస్తూ ఉంటాడు. నీలో ఉన్న బలహీనతలు నీకు తెలియవు కాని గురువుకు తెలుస్తూ ఉంటాయి. ఇవన్నీ చూసి ఒకోదానిని బయటకు లాగి, వాటిని కాల్చి బూడిద చేసి, నిన్ను పరమపవిత్రుడిని చేసేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. మనం దేవుడిని తెలుసుకోవాలి అంటే దేవుడు ఎంత సైలెంట్‌గా పనిచేస్తున్నాడో అంత సైలెంట్‌గా మనం పనిచేయాలి, లోకానికి సంబంధించిన గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపులు కోరుకొంటే దేహాభిమానం పెరిగిపోతుంది, హృదయంలో ఉన్న నిజానికి దూరమైపోతాము.

గురువు ఏమి చేస్తాడు అంటే ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు. గురువు నీకు టీచ్ చేస్తాడు, నీకు అంతర్‌దృష్టిని కలుగజేసి నిజమైన గురువు లోపల ఉన్నాడు కదా ఆయన చేతికి అందేవరకూ నిన్ను లోపలకు గెంటుతాడు. లోపల గురువు నిన్ను లోపలకు గుంజుకొని నీలో ఉన్న జీవలక్షణాలను తొలగించి వాడి స్వరూపాన్ని నీకు ఇస్తాడు, అదే మోక్షం. భగవంతుడు ఉన్నాడు అని శాస్త్రం చెప్పినా మనం పూర్వజన్మలలో సత్కర్మ చేసి ఉండకపోతే, పూర్వపుణ్యం మనకు లేకపోతే భగవంతుడి మీద మనకు విశ్వాసం కలుగదు. రామాయణం, భారతంలో మన దైనందిన జీవితంలో వచ్చే కష్టాలగురించి,

మనిషి ఏ పరిస్థితులలో ఎలా ప్రవర్తిస్తాడో ఇవి అన్నీ చెప్పాడు. ఉపనిషత్తులకంటే కావ్యాలు చదివితే మీకు లోకజ్ఞానం ఎక్కువ వస్తుంది. ఉపనిషత్తులలో ఏమీలేదు అని కాదు అందులో బ్రహ్మం గురించి చెప్పారు. లోకానికి సంబంధించిన అనుభవాలు, ఎప్పడు ఎలా ప్రవర్తించాలి, మన బిహేవియర్ ఎలా ఉండాలి ఇటువంటివి అన్నీ రామాయణంలో, భారతంలో ఏదో సందర్భంలో తీసుకొని వచ్చి మనకు టీచ్ చేస్తూ వచ్చాడు.

మనం జరిగిపోయిన గొడవల గురించి ఎక్కువ ఆలోచిస్తాము లేకపోతే భవిష్యత్ గురించి ఎక్కువ ఊహిస్తూ ఉంటాము. దాని అర్థం ఏమిటి అంటే మనం వర్తమానకాలంలో బతకటం లేదు. వర్తమానకాలాన్ని ఎవడైతే సద్వినియోగం చేసుకొంటాడో వాడిని భౌతిక విద్యలు, పారమార్థిక విద్యలు అన్ని విద్యలు వాడినే వరిస్తాయి. ఎవడైతే కాలాన్ని సద్వినియోగం చేసుకొంటున్నాడో వాడిని మటుకే మోక్షలక్ష్మి వరిస్తుంది. మీరు ఏదైనా మంచి చేయగలిగితే చేయండి, మంచి చేయలేకపోతే ఊరకఉండండి. మీరు శాస్త్రాన్ని విడిచిపెట్టవద్దు. గురువు మీద ఎంత గౌరవం ఉండాలో శాస్త్రంమీద కూడా అంతే గౌరవం ఉండాలి, శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించండి. భగవద్గీత ఉపదేశ గ్రంథము, దేవుడు జీవుడికి చెప్పిన సందేశం. భగవద్గీతను అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అది అనుభవంలోనికి తీసుకొంటే దాని తాలుక సుఖం మనకు తెలుస్తుంది. అందరు ఋషులు చెప్పిన మాటలు భగవద్గీతలో ఉన్నాయి. అందుచేత మీకు ఉన్న అవకాశాన్ని బట్టి అందరూకూడా భగవద్గీతను అధ్యయనం చెసి తరించవలసిందిగా సవినయంగా మీకు మనవి చేసుకొంటున్నాను.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 07-05-08, పెనుమంట్ర)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ధర్మం సనాతనం అని మన పెద్దలు చెపుతారు. సనాతనం అంటే పుట్టుకలేనిది. ఎప్పడూ సర్వకాల సర్వావస్థలలో ఏదైతే ఉంటుందో అది సనాతనం. మహాభారతయుద్ధం అయిపోయాక కుంతీదేవి అరణ్యవాసానికి వెళ్లేటప్పడు నాలుగు మంచి మాటలు చెప్పమని ధర్మరాజు తల్లిని అడిగాడు. మనిషి అయ్యాక కోరిక వస్తుంది, కోపం వస్తుంది, గర్వం వస్తుంది, ఇవి అన్నీ సహజంగా మనుషుల్లో చూస్తున్నాము కదా. అలాగే నీకు కూడా రావచ్చు. కాని ఎట్టి పరిస్థితులలోను ధర్మాన్ని విడిచిపెట్టవద్దు అని చెప్పింది. నీవు ధర్మాన్ని ఆచరించాలి.

నీకు ఎప్పుడైనా కోపం వచ్చింది అనుకో, కోపం వచ్చినప్పుడు కూడా ధర్మాన్ని విడిచిపెట్టకు. పరిస్థితులు నీకు అనుకూలంగా లేవు అనుకో అప్పుడు కూడా ధర్మాన్ని విడిచిపెట్టవద్దు. ధర్మాన్ని ఆచరించేవాడికి అర్థం రావచ్చు, వాడు అనుకొన్న కోరికలు నెరవేరవచ్చు కాని అప్పడే నీకు మోక్షకాంక్ష రాదు అని చెప్పింది. ధర్మము, అర్థము, కామము ఇవి త్రివర్గాలు, ఈ మూడింట్లోపడి ఉన్నంతకాలము నీకు ఇవి అన్నీ నెరవేరవచ్చు గాని మోక్షం వైపుకు నీ మనస్సు తిరగదు. ఈ మూడు ఉన్నప్పటికీ ఇంకా లోపల ఏదో వెలితి ఉంది అని నీకు ఎప్పుడైతే తెలుస్తోందో, ఇదే మన జీవిత గమ్యం కాదు అని మీ హృదయంలో ఎప్పుడైతే తోచిందో అప్పుడు నువ్వు ముముక్షువు అవుతావుగాని ఈ లోపుగా అవ్వటానికి నీకు అవకాశం లేదు.

శంకరాచార్యులవారు ఏమని చెప్పారు అంటే కాలప్రవాహంలో అన్నీ కొట్టుకొని పోతాయి. నువ్వు గోవిందుడిని పూజించుకో, ఆయన నామాన్ని స్మరించుకో, ఆయన రూపాన్ని ధ్యానించుకో, భగవద్గీతను అధ్యయనం చెయ్యి, సహస్రనామాలు చేసుకో అని చెప్పారు. మీరు భగవద్గీతను ఎక్కడో బీరువాలో పెట్టుకోకూడదు, టేబుల్ మీద పెట్టుకోవాలి. యదాలాపంగా మీరు కూర్చున్నప్పుడు అది చదవాలి అనే బుద్ధి పుడుతుంది లేకపోతే చదవాలనే బుద్ధి రాదు. మీరు ఎంత పండితులైనా, ఎంత ధనవంతులైనా చనిపోయేటప్పుడు ఇవి ఏమీ కలిసిరావు. ఇవి అన్నీ సన్మానాలకు, ఊరేగింపులకు పనికి వస్తాయికాని స్వరూపజ్ఞానం పొందటానికి ఇవి ఏమీ ఉపయోగపడవు. దేవుని అనుగ్రహం లేదు అని మనం అనుకొంటాము గాని ఆ ప్రవాహాన్ని మనం అందుకోలేకపోతున్నాము. దానిని పట్టుకోవాలి అంటే కొంత అర్హత, యోగ్యత ఉండాలి. ఆ యోగ్యత, అర్హత మనకు వస్తే పట్టుకొనేశక్తిని ఆయనే మనకు ఇస్తాడు. దేవుడు అనుగ్రహ స్వరూపుడు మీరు ఊరక ఉండండి అని భగవాన్ అంటారు. ఊరక ఉండటం అంటే హృదయంలో మీ మనస్సును నిలబెట్టి ఇతర ఆలోచనలు, తలంపులు లేకుండా చూసుకో అది ఊరక ఉండటం అంటే. అదే భగవంతుడు గీతలో చెప్పాడు. ఎక్కడైతే సద్వస్తువు ఉందో అక్కడ నీ మనస్సును నిలబెడితే అది నువ్వు అవుతావు అయితే ఇతర విషయాలు, ఇతర చింతలు రాకూడదు. దానికి వైరాగ్యం ఉండాలి. నేను అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను అని గీతలో పరమాత్మ చెప్పాడు. మనం ఏమనుకొంటున్నాము అంటే ఈ శరీరమే ఆత్మ, మనస్సే ఆత్మ అని ఇలా

అనుకొంటున్నాము, అది కాదు. భగవంతుడు అందరి హృదయాలలో ఏదిగా ఉన్నాడో అది ఆత్మ, అది మాత్రమే నిజం, అక్కడికి చేరుకోవటమే మన జీవిత గమ్యం. అయితే భగవంతుడు వేరు, ఆత్మవేరుకాదు. జ్ఞానులు దేనినైతే ఆత్మ ఆత్మ అంటున్నారో దానినే భక్తులు భగవంతుడు అంటున్నారు.

మనం నేను, నేను అంటాము. తరువాత నాది, నాది అంటాము. ఈ నేను, నాది రెండు తలంపులలోనే మాయ అంతా భగవంతుడు పెట్టాడు. ఈ ఇల్లు నాది, పొలం నాది అనుకొంటావు. నువ్వు నాది నాది అనుకొనేదంతా భగవంతుడిదే, నీది అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు, సంపద అంతా ఈశ్వరుడిదే, ఆ దేహప్రారబ్ధాన్నిబట్టి కొంత కేటాయిస్తాడు. మోక్షం అంటే మన నిజమైన ఇంటికి మనం వెళ్ళిపోవటం. మన నిజమైన ఇల్లు మన హృదయంలోనే ఉంది. నువ్వు అక్కడికి చేరుకొనే వరకూ నీకు పునర్జన్మలు తప్పవు. నీకు దేహం మీద అభిమానం తగ్గితేనేకాని దైవం మీద అభిమానం రాదు. మీకు ఉన్న పాండిత్యం, ధనం, గౌరవాలు ఇవి అన్నీ అవుట్‌సైడ్ గొడవలు. నువ్వు లోపలకు వెళ్ళు, నువ్వు లోపలకు వెళ్ళు. లోపలకు ప్రయాణం చేసేటప్పుడు నీకు కొన్ని మహిమలు చేసే శక్తి రావచ్చు, ఎదుటివారి మనస్సులో ఏమి ఉందో తెలుసుకొనేశక్తి నీకు రావచ్చు, ఇవన్నీ వదిలెయ్యి. నీ శిరస్సులో మనస్సు ఎంత సహజంగా ఉంటోందో అంత సహజంగా ఆత్మలో నిలబడేవరకు నువ్వు ప్రయాణం చెయ్యి, అప్పుడు నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. నువ్వు ఇతర విషయాలను చింతిస్తూ ఉంటే మనస్సు ఆత్మను వదిలేసి బయటకు వచ్చేస్తుంది.

నాకు శాంతి లేదు, శాంతి ఎలాగ వస్తుంది అని అడుగుతున్నారు. ఒక్క ఆత్మలో తప్పించి బయట ప్రపంచంలో ఏ వస్తువులోను శాంతిలేదు, ఆనందం లేదు. మీ నిజమైన ఇంటికి మీరు చేరుకొనేవరకు ఎవడికీ శాంతి దొరకదు. ఈలోపుగా ఎప్పుడైనా మీ కోరికలు నెరవేరినప్పుడు మీకు కొంత శాంతిగా ఉన్నట్లు అనిపిస్తుంది. అంటే కోరికలు నెరవేరినప్పుడు మీ మనస్సు అది ఎక్కడైతే పుట్టి వచ్చిందో అక్కడకు వెళుతుంది, అప్పుడు ఆ లోపల ఉన్న శాంతిని కొంత పీల్చుకొంటుంది. మరల అది విడిచిపెట్టేసి వచ్చేస్తుంది, అప్పుడు మరల అశాంతే, అంటే కుక్క తోకలాగ అయిపోతుంది. మనస్సు సహజంగా, నిర్మలంగా హృదయంలో ఉండగలగాలి, అప్పుడుకాని నీకు శాంతి దొరకదు. మాకు శాంతి లేదు అని ఒకరు భగవాన్‌తో

అంటున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు శాంతి లేకపోవటం ఏమిటి, నీ పేరే శాంతి, నీ స్వరూపమే శాంతి, ఉన్నదే శాంతి అంటున్నారు. నువ్వు కల్పించుకొన్న గొడవల వలన అశాంతి వస్తోంది కాని లేకపోతే అశాంతి లేదు. హృదయంలో ఉన్నది శాంతే, అక్కడ అశాంతి లేదు మీరు ఆ మోక్షస్థానం దగ్గరకు, శాంతిస్థానం దగ్గరకు వెళ్లలేకపోతున్నారు. అక్కడకు చేరుకోవటానికి మీకు ఏదైతే అడ్డు వస్తున్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. మనస్సు బాహ్యముఖానికి వెళితే అక్కడ ప్రపంచంలో అంతా దుమ్ము, గడ్డి అంతకంటే ఏమీ లేదు. ఏసుక్రీస్తు ఏమని చెప్పాడు అంటే మొత్తం దేశంలో ఉన్నదంతా నువ్వు సంపాదించేశావు అనుకో నువ్వు ఎవరో నీకు తెలియదు అనుకో నువ్వు అనుభవించే నష్టం ఎంతో నువ్వు చనిపోయాక తెలుస్తుంది అన్నాడు. బయట ఏదో ఉంది, ఏదో ఉంది అని అంతా నొల్లేసుకొన్నాను, చివరకు ఏమీ లేదు గుల్ల అయిపోయాను అని చచ్చాక నీకు తెలుస్తుంది.

నీ మనస్సు ఎక్కడా వాలకుండా ఉండటం వైరాగ్యం, మనస్సు దాని స్వస్థానాన్ని విడిచిపెట్టకుండా ఉండటం జ్ఞానం అన్నారు భగవాన్. నిజమైన బంగారం మన హృదయంలోనే ఉంది. మనస్సు లోపలకు వెళితే నిజమైన వస్తువును తెలుసుకొంటుంది, బయటకు వెళితే అంతా దుమ్మే. అందుచేత లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి, ఆ ఆకర్షణలను చూసి నిజం అనుకొని గోవిందుడి నామాన్ని మర్చిపోవద్దు. వర్షిప్ గోవిందా, వర్షిప్ గోవిందా. ఆచార్యులవారు భజగోవింద శ్లోకాలలో అంటారు నీ భార్య ఉంది అనుకో, ఇప్పుడు నిన్ను ప్రేమగా చూస్తుంది, గౌరవంగా చూస్తుంది. ప్రాణం పోయిన తరువాత నిన్ను ప్రేమించిన భార్యే నీ మొఖం చూసి భయపడుతుంది, ఈ శవాన్ని ఎప్పుడు తీసుకొని పోతారా అని కనిపెట్టుకొని ఉంటుంది, అది లోకం తీరు. వాళ్ళు మిమ్మల్ని బాగాచూడటం లేదు, వీళ్ళు మమ్మల్ని బాగా చూడటంలేదు అంటారు. ఇంట్లోవారు బాగా చూడకపోవటం ఒకరకంగా మంచిది, వారి మీద మనకు మమకారం పోతుంది. వారిమీద మమకారం పెంచుకుంటే చనిపోయేటప్పుడు వారే జ్ఞాపకం వస్తారు. వారికి మనమీద ప్రేమలేదు అంటే ప్రేమ లేకపోవటమే మంచిది, మనుషుల ప్రేమ ఏమి నిలబడుతుంది. ప్రేమిస్తే చైతన్యం ప్రేమించాలి, మనస్సు ఎవరిని ప్రేమిస్తుంది. అందులో అసలు ప్రేమ ఉంటే కదా ప్రేమించటానికి.

ఆ చైతన్యం యొక్క అనుగ్రహం మన మీద పడింది అనుకో మనలో ఉన్న వాసనలను ఒక్కో దానిని బయటకు గెంటుతుంది. గయ వెళ్ళిన వారు అందరూ వారికి ఇష్టమైన వస్తువును విడిచిపెట్టి రావాలి అంటారు. వారికి ఇష్టం లేనివి విడిచిపెట్టి వచ్చేస్తున్నారు. గయలో సిద్ధాంతం ఏమిటి అంటే మన పూర్వీకులకు పిండం పెట్టి ఏదో ఒక దానిని విడిచిపెట్టమంటే మీలో పది బలహీనతలు ఉంటే ఒక్క బలహీనత అయినా విడిచిపెట్టమని అసలు అర్థం అది. నీ పూర్వీకులకు పిండం వేసావు అయిపోయింది మరి నీ మాట ఏమిటి అని. అక్కడ పండు, కూర విడిచి పెట్టటంకాదు, మీలో ఉన్న ఒక్క బలహీనతను విడిచిపెట్టండి.

గురువు అంటే ఏవో మాటలు చెప్పటంకాదు. మనం డాక్టరు దగ్గరకు ఎందుకు వెళతాము, రోగం తగ్గించి పంపుతాడు అని వెడతాము. అలాగే ఎవడైనా గురువు దగ్గరకు వెళితే వాడి దుఃఖాన్ని తగ్గించాలి. వాడి దుఃఖాన్ని తగ్గించలేకపోతే వాడు గురువు కాదు. కళ్ళు మూసుకొంటే నిన్ను నీవు చూసుకొంటావు, కళ్ళు తెరిస్తే అదే మాకు చూపిస్తావు, వాడు గురువు. నువ్వు మావంక చూస్తూ ఉంటే మాలోని బలహీనతలను కెలికినట్లుగా ఉంటుంది, ఎందుచేతనంటే కెలకకుండా అవి బయటకు రావు. అవి నీ తలకాయలోనికి రాకుండా అవి ఉన్నట్లు కూడా నీకు తెలియదు. ఆ బలహీనతలు ఉన్నట్లు నీకు తెలియనివ్వడు అనుకో, వాటిని పోగొట్టుకోవటానికి నీవు ప్రయత్నం చేయవు. ఆ బలహీనతలను తొలగించుకోకపోతే అవే అనేక జన్మలకు కారణం అవుతాయి. గురువు చేసేపని బయట ఏమీ లేదు, అంతా లోపలే ఉంది. మీరు ఎవరినైనా ప్రేమిస్తున్నారు అనుకోండి దానికి కారణం కనబడకూడదు. కారణం కనిపిస్తూ ఉంటే అది ప్రేమకాదు. బైబిలులో చెపుతాడు మీకిష్టమైన వారిని ఎలాగూ ప్రేమిస్తారు. మీరు ప్రేమించాలంటే మీరంటే ఇష్టపడనివారిని కూడా ప్రేమించండి కాని సోమరితనాన్ని, బద్ధకాన్ని ప్రేమించవద్దు. మనందరం బద్దకస్తులం. మనకు పనికంటే కూడా బద్దకం అంటే ఇష్టం. ఏరోజు పనులు ఆరోజు ముగించుకోండి, రేపుకు రూపు లేదు.

మనంతట మనం కష్టపడి సాధనచేయలేకపోతున్నాము అనుకోండి, హోలీ కంపెనీ వలన వాళ్ళ వైబ్రేషన్స్ మన మీద పనిచేస్తాయి. మీ డబ్బును, ఆస్తిని మీరు ఎలా కాపాడు కొంటున్నారో అలా హోలీ కంపెనీని కాపాడుకోవాలి. ఎందుచేతనంటే అది కూడా పెద్ద

ఆస్థితోటి సమానము. నువ్వు సాధన చెయ్యాలంటే పట్టుదల ఉండాలి, సహనం ఉండాలి. నీ మనస్సును నువ్వు మచ్చిక చేసుకొంటే నీకు సహనం వస్తుంది. సహనం ఉన్నవాడికి తూకం పెరుగుతుంది, సహనం ఉన్నవాడు మాత్రమే లోపలకు ప్రయాణం చేయగలడు, హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళగలడు. దేవుడికి తెలియకుండా ఈలోకంలో ఏదీ జరుగదు, ఆయన జడ్జిమెంటే ఫైనల్. దేవుడు మాకు అన్యాయం చేసాడు అని మీరు ఎప్పుడూ అనకండి, అలా అంటే మీరు ఆయనను అగౌరవపరచినట్లు అవుతుంది. దేవుడు ఎందుకు అన్యాయం చేస్తాడు. ఒకరి మీద ఇష్టం, ఒకరిమీద అయిష్టం ఉంది అనుకోండి వాడు దేవుడు ఎలా అవుతాడు. మన ప్రారబ్దంలో ఉన్నదే మనకు ఇస్తాడు అంతేగాని మనమీద ఇష్టంలేకపోవటంకాదు. మనకు ఏది చేసినా దేవుడు న్యాయం చేసాడు అని అనుకొంటే పరిస్థితి చక్కబడుతుంది, మీ మనస్సు అణిగిపోతుంది. జ్ఞానికి లోపల, బయట ఏమీ ఉండదు. ఎటుచూసినా ఒక్కటే. లోపల ఉన్న పరమాత్మ దర్శనం అయ్యాక వినటానికి ఏమీ ఉండదు, చూడటానికి ఏమీ ఉండదు. మన కళ్ళ ద్వారా ఎవరు చూస్తున్నారు? మనస్సు చూస్తోంది. చెవుల ద్వారా ఎవరు వింటున్నారు? మనస్సు వింటోంది. ఆ మనస్సు వెళ్ళి హృదయంలో కరిగిపోయాక ఇంక నీకు చూడటానికి ఏమీ లేదు, వినటానికి ఏమీ లేదు, నీకంటే అన్యంగా ఏమీ లేదు. నిన్ను పీడించేది ఇతరులు కాదు, నీ అహంభావనే నిన్ను పీడిస్తోంది. పోనీ దానిని విడిచిపెట్టేద్దాము అంటే దానికంటే ఇష్టమైనది మనకు ఏమీ లేదు, మనకు ఇష్టమైన దానిని మనం విడిచిపెట్టలేము. అరుణాచలేశ్వరుడు దొంగ. ఎవడైతే అరుణాచలం, అరుణాచలం అని స్మరిస్తున్నాడో వాడికి తెలియకుండా వాడి అహంభావనను, వాడి దేహబుద్ధిని దొంగతనం చేసి పట్టుకొనిపోతాడు. అరుణాచల స్మరణ వలన వచ్చే లాభం ఎక్కువ, అంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం.

రామకృష్ణ పరమహంసగారు చెప్పారు ఒక ఉల్లిపాయ తీసుకోండి. దానికి రేకులు ఉంటాయి కదా. ఒకో రేకు ఒకో రేకు తీసేయండి, ఇంక ఉల్లిపాయ కనిపిస్తుందా అన్నారు ఇంక ఉల్లిపాయ ఉండదు. అలాగే మీకు వచ్చే తలంపులను ఇది నేను కాదు, ఇది నేను కాదు అని ఒకో తలంపును ఒకో తలంపును తీసేయండి అప్పుడు ఇంక నేను కనబడదు. తలంపుల మూటే ఈ నేను. తలంపులను తీసేస్తే ఇంక నేను లేదు. మాకు చాలా కష్టాలు

వచ్చాయి అని కొంతమంది అంటూ ఉంటారు. కృష్ణుడు జైలులో పుట్టాడు. కృష్ణుడు పుట్టిన 15వ రోజున పూతన వాడిని చంపటానికి వచ్చింది. పాండవుల గుఱ్ఱాలు తోలాడు, యుద్ధంలో కౌరవులు కొట్టే దెబ్బలకు ఈయన సిల్కు చొక్కాలు చిరిగిపోయేవి. అంటే ఆయన కష్టపడ్డాడా, మనం కష్టపడుతున్నామా? బాహ్యజీవితంలో ఆయన పెద్ద సుఖపడినట్లు కనబడదు. ఆయన 18 గంటలు పనిచేసేవాడు. కృష్ణుడు ఒకమాట చెప్పాడు. నేను పని చేసి సంపాదించేది ఏమీ లేదు, పనిమానేస్తే పోయేదీ ఏమీ లేదు. కాని లోకం కోసం పనిచేస్తున్నాను అని చెప్పాడు. అది మనకు అర్థమవ్వాలి. భారతయుద్ధంలో కౌరవులు అందరూ నశించాక గాంధారి కృష్ణుడిని శపించింది. నువ్వు యుద్ధం ఆపుచేయలేకపోయావు. నా వంశం ఎలా నశించిందో అలాగే నీ యదు వంశం కూడా నాశనం అయిపోవాలి అని శపించింది. ఆశ్చర్యం అప్పుడు కూడా ఆయన మొఖంలో వికారం కనబడలేదు, ఆయన దేవుడు. భగవంతుడు నీ హృదయంలో ఎంత నిండుగా ఉన్నాడో నువ్వు చేసే సాధన కూడా అంత నిండుగా ఉంటే ఆయన నీకు దొరుకుతాడు.

భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి మేము ఇంటి దగ్గర చాలా కష్టాలు పడుతున్నాము. మీ పని బాగుంది ఇక్కడ సోఫాలో కూర్చొన్నారు అని అన్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే నేను అరుణాచలం వచ్చిన కొత్తలో రాళ్ళమీద కూర్చొనేవాడిని. పాపం భగవాన్‌కు నీడ లేదు రాళ్ళ మీద కూర్చొంటున్నారు అని కొంతమంది అనుకొనేవారు. ఇప్పుడు మీరు వచ్చి భగవాన్ హాయిగా ఉన్నారు, సోఫాలో కూర్చొంటున్నారు అన్నారు. నేను రాతిమీద కూర్చొన్నప్పుడు రాయి మీద కూర్చొన్నాను అని అనుకోలేదు. సోఫామీద కూర్చొన్నప్పుడు నేను సోఫా మీద కూర్చొన్నాను అనుకోలేదు. చూసేవారిదే ఈగోల అంతా, అప్పుడు కష్టపడిపోయాను, ఇప్పుడు సుఖపడిపోతున్నాను అనే గోల అంతా ఈ చూసేవారికే అన్నారు. చైతన్యానికి సుఖం ఏమిటి? కష్టం ఏమిటి? దేహబుద్ధి ఉన్నవాడికి కష్టం సుఖం కాని దేహబుద్ధి లేనివాడికి కష్టం ఏముంది? సుఖం ఏముంది? మనం నేను, నాది ఇవి రెండూ విడిచిపెట్టలేకపోతున్నాము అనుకోండి, వీటిలో నుండి తప్పకోవటానికి ఇంకొక ఉపాయం చెప్పారు. నేను అనేది భగవంతుడే, నాది అనేది భగవంతుడే అనుకొంటే సరిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా విమర్శించినా అదీ భగవంతుడికే చెందుతుంది, ఎవరైనా పొగిడినా అదీ భగవంతుడికే

చెందుతుంది అనుకోండి. మీరు వికారం లేకుండా ఉండగలిగితే నిజంగా భగవంతుడికే చెందుతాయి. ఈ రెండూ భగవంతుడే అనుకొంటే దేహం మీద అభిమానం తగ్గుతుంది, దేవుడి మీద అభిమానం పెరుగుతుంది, అలాగ కూడా ప్రాక్టీసు చెయ్యండి.

మనం విషయాల గురించి ఆలోచిస్తూ విషయాలను జయించలేము. భగవంతుడి గురించి ఆలోచిస్తూ ఉంటే, ఆయననే చింతిస్తూ ఉంటే ఏదో రకంగా భగవంతుడి చుట్టూ మీరు తిరుగుతూ ఉంటే మీ పునర్జన్మ కారణాలు అన్నీ వాటి అంతట అవే బయటకు పోతాయి వాటిని బలవంతంగా మీరు గెంటనక్కరలేదు. మీ మొఖం అటు విషయాలవైపుకు తిప్పే బదులు ఇటు భగవంతుడివైపుకు తిప్పండి, వాటిని డైరెక్టుగా మనం ఫేస్ చేసి బయటకు గెంటలేము. మనం దైవచింతనలో ఉంటే అలవాటును బట్టి అవి వస్తాయి కాని మనం ఎప్పుడైతే హృదయంలో వాటికి ప్లేసు ఇవ్వటం లేదో వాటంతట అవే వెళ్ళిపోతాయి, మనం శ్రమపడి వాటిని గెంటనక్కరలేదు. దూడకి ఎదురుగా పచ్చగడ్డి కనిపిస్తోంది అనుకోండి మనం ప్రక్కన ఒట్టిగడ్డి వేసినా అది తినదు. అలాగే మీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందం మీ మనస్సు కొంచెం రుచిచూసింది అనుకోండి ఇంక బాహ్యవిషయాల జోలికి వెళ్ళమన్నా వెళ్ళదు. మీ ఇంట్లో ఎవరికైనా దారిద్ర్యం వచ్చింది అనుకోండి. భగవంతుడికి మీమీద ఇష్టం లేక దారిద్ర్యం తీసుకొని రాడు, దాని రుచి చూపించటానికి ఇతరుల కష్టాలు ఎలా ఉంటాయో, ఆకలి బాధ ఎలా ఉంటుందో చూపించటానికి ఇది అంతా చేస్తాడు. దారిద్ర్యం నేర్పేపాఠాలు కూడా కొన్ని ఉంటాయి. లోకంలో మనకు మంచి వచ్చినా, చెడ్డ వచ్చినా పుణ్యం వచ్చినా పాపం వచ్చినా ఏది వచ్చినా సరే వాటిని ఇముడ్చుకొనే శక్తి మీకు ఉండాలి. మీ మీద మీకు విశ్వాసం ఉంటే ఆ యిముడ్చుకొనే శక్తి వస్తుంది. మీకు ఆత్మవిశ్వాసం లేదు అనుకోండి యిముడ్చుకొనే శక్తి మీకు ఉండదు. యిముడ్చుకొనే శక్తి మీకు వస్తూ ఉంటే మీకు సహనం పెరుగుతుంది. ఆ సహనంతో కూడిన సత్వగుణమే మీ మనస్సును తీసుకొని వెళ్ళి హృదయంలో ముంచుతుంది, అక్కడ కరిగేలా చేస్తుంది, లోపలఉన్న సత్యవస్తువును మీకు పట్టి యిస్తుంది, ఇదంతా సత్వగుణం చేసేలాభము. కొంతమంది లాభనష్టాలతో సంబంధం లేకుండా శాంతిగా ఉంటారు. లాభం వచ్చినప్పడు మనకు ఎవడైతే ఇచ్చాడో వాడే పట్టుకొని పోయాడు అనుకొంటారు. అప్పడు మనం కారణం కాదు, ఇప్పడు కాదు

అప్పుడు మనం కారణం అనుకొంటే మరల పోయినప్పుడు మనకు దుఃఖం వస్తుంది.

కర్మ సన్యాసం అంటే ఏమిటి అని భగవాన్‌ను అడిగితే కర్మ సన్యాసం అంటే అసలు కర్మ చేయకుండా కూర్చోవటం కాదు, పనిచేసి ఫలితాన్ని విడిచిపెట్టాలి. పురాణాలలో ప్రార్థన చేయమంటారు, ఉపనిషత్తులలో ఎక్కువ ధ్యానం చేయమంటారు అని భగవాన్‌ను అడిగితే ప్రార్థన చేసేది, ధ్యానం చేసేది కూడా మనస్సే. మీరు మనస్సు ఉందనుకొంటున్నారు కాబట్టి పురాణాలలో చెప్పినట్లు, ఉపనిషత్తులలో చెప్పినట్లు చెయ్యండి అని చెప్పారు. మబ్బులు లేని ఆకాశం ఎంత నిర్మలంగా, ఎంత నిశ్చలంగా, ఎంత ప్రశాంతంగా ఉంటుందో అలాగ ఏ మానవుడి మానసం అంత నిర్మలంగా, అంత నిశ్చలంగా, అంత ప్రశాంతంగా ఉంటుందో వాడు దేవుని అనుగ్రహానికి పాత్రుడవుతాడు, వాడికి జ్ఞానోదయం కలుగుతుంది. మీ మనస్సు అలాగ ఉందో లేదో చూసుకోండి. మాకు చాలా కష్టాలు వస్తున్నాయి, చాలా కష్టాలు వస్తున్నాయి అంటారు. ఇందులో రాముడికంటే, కృష్ణుడికంటే ఎక్కువ కష్టాలు పడినవారు ఉన్నారా? వారు పడిన కష్టాలలో మీరు వెయ్యోవంతు కూడా పడి ఉండరు. అయితే మీకు ఓర్చుకునే శక్తిలేక కష్టాలు పడుతున్నాము, కష్టాలు పడుతున్నాము అంటున్నారు. ద్రౌపతి మహాపతివ్రత, ద్రౌపతి భర్తలు మహాబలవంతులు, అర్థబలం ఉంది, అంగబలం ఉంది అయినా ద్రౌపతి కూడా చాలా బాధలు పడింది. కృష్ణుడిని దేవుడిగా నమ్మికూడా వారు కష్టాలు పడ్డారు. ఎందుచేతనంటే ఇదంతా ఆయన లీల. అంటే ఆ కష్టాల ద్వారా నేర్చుకోవలసిన పాఠాలు ఉన్నాయి, ఆ జీవుడు కొంత ట్రైనింగ్ అవ్వాలి.

ఈశ్వర సాక్షాత్కారం పొందటానికి నువ్వు ఎక్కడ ఉన్నావు అనేది ముఖ్యంకాదు, నీ మనస్సుకు ఎంతవరకు ట్రైనింగ్ ఇస్తున్నావు అనేది ముఖ్యం. క్రమశిక్షణ లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. అందుచేత పెద్దవారు ఏమి చేస్తారు అంటే చిన్నవాళ్ళకు క్రమశిక్షణ నేర్పుతూ వస్తారు. మీ వెనకాల వాళ్ళకు కేవలం డబ్బు సంపాదించి యిచ్చేయటంకాదు, మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వాలి, అది ముఖ్యం. ఇది చిన్నపని, ఇది పెద్దపని అని అలా అనుకోకూడదు, మన మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వాలి. పరలోకం కోసంకాదు, ఈలోకంలో మనం సక్సెస్ అవ్వటానికి మనస్సుకు ట్రైనింగ్ అవసరం. మన ఇంట్లో మనం సుఖంగా ఉండాలంటే మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వాలి, అంతా మనస్సులోనే ఉంది అర్జునా! బయట నీకు శత్రువులు

ఉండవచ్చు, అది వేరే విషయం, నీ మనస్సును మటుకు నువ్వు శత్రువుగా చేసుకోకు, నీ మనస్సును నువ్వు మిత్రుడిగా చేసుకో అని పరమాత్మ గీతలో రిపీటెడ్‌గా చెప్పాడు. నీ మనస్సు చెప్పినట్లు నువ్వు వినకు, నువ్వు చెప్పినట్లుగా నీ మనస్సు వినాలి. అప్పుడు నీ ఉపాధి ద్వారా అనేక ఘనకార్యాలు జరుగుతాయి. మీరు ఎవరి ఇంటికి అయినా వెళ్లారు అనుకోండి, వారు గౌరవం చేయరు అనుకోండి, ఇంకొకరి ఇంటికి వెళతారు అనుకోండి, వారు గౌరవం చేస్తారు అనుకోండి, వారిని, వీరిని కూడా మీ మనస్సు సమానంగా చూసుకొంటోందా లేదా అని ఇవన్నీ మీరు పరిశీలన చేసుకోవాలి.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 12-06-08, వేంద్ర)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏది ఎప్పుడు జరగాలా అది అప్పుడు జరుగుతూ ఉంటుంది. మనం స్వతంత్రులం కాదు. ఒక్క పురుషోత్తముడు తప్పించి మిగతా అందరూ జీవకోటికి సంబంధించినవారే. మనం ఏరోజున ఎక్కడ ఉండాలి, మన శరీరం ద్వారా ఎప్పుడు ఏమి జరగాలి, మన శరీరం ఏరోజున చనిపోవాలి ఇవన్నీ కూడా ఈశ్వరనిర్ణయం ప్రకారం జరుగుతూ ఉంటాయి, దానిని మనం ఉల్లంఘించలేము. ఉల్లంఘించటానికి మనం స్వతంత్రులంకాదు, మనం పరతంత్రులం. మనం ఎన్ని అనుకొన్నా జరిగేది ఈశ్వరసంకల్పమే. మన ప్రారబ్దంననుసరించి ఈ శరీరం ఎప్పుడు ఎక్కడ ఉండాలి, ఈ శరీరం ద్వారా ఏమి జరగాలి, ఎంతకాలం జీవించాలి, అది ఎప్పుడు మరణించాలి ఇది అంతా ఒక ప్రణాళికాబద్దంగా ఈ జీవితం జరుగుతూ ఉంటుంది. మనం సినిమా చూసేటప్పుడు మొదటిభాగం చివర్లో, చివర భాగం మొదట్లో చూపించారు. మొదటిభాగం మొదటే చూపిస్తారు మన జీవితం కూడా ఏ సంఘటన ఎప్పుడు ఎలా జరగాలో అలాగ క్రమంగా జరుగుతూ ఉంటుంది. అది క్రమం కాదని మనం అనుకొన్నా కుదరదు. ఈశ్వరుడు నిర్దేశించిన ప్రకారం ప్రతీక్షణం అలా జరిగిపోతూ ఉంటుంది. ఏది ఎప్పుడు జరగాలో అప్పుడు జరుగుతుంది కాని మనం తొందర పడటంవలన తొందరగా జరగదు, మరిచిపోవటం వలన ఆలస్యంగా జరగదు. మీరు భగవంతుడిని ఎప్పడైనా జ్ఞాపకం పెట్టుకొంటారా అని ఒక భక్తుడిని అడిగాను. భగవంతుడిని మరిచిపోయే వాళ్ళు జ్ఞాపకం పెట్టుకోవాలికాని నాకు మరుపే లేదు కదండి ఇంక జ్ఞాపకం పెట్టుకోవటం

ఏమిటి అన్నాడు. అటువంటి మాటలవలన మనకు వివేకం పెరుగుతుంది.

జీవితం చాలా అందమైనది. మీకు భగవంతుడు ఎంతకాలం అయితే జీవితాన్ని ఇచ్చాడో అంతకాలం మీరు సుఖంగా జీవించాలి. కష్టాలు వస్తే రానివ్వండి, దేహప్రారబ్ధాన్ని బట్టి అవి వస్తాయి, కష్టాలు కూడా మీకు ట్రైనింగ్ కోసం వస్తాయి. జీవితం అంతా ఒక ప్రణాళికాబద్ధంగా నడుస్తుంది, కర్మసిద్ధాంతాన్నిబట్టి ఏ సంఘటన ఎప్పుడు జరగాలో భగవంతుడు అలా అరేంజ్ చేస్తాడు. జీవితాన్ని బలవంతంగా ముగించుకోకూడదు, అలా బలవంతంగా చనిపోతే రాబోయేజన్మలు చెడ్డజన్మలు వస్తాయి. మన దేహప్రారబ్ధంలో మంచి ఉన్నా, చెడ్డ ఉన్నా దేహానికి సహజంగా మరణం వచ్చేవరకు మనం ఆగాలి కాని తొందరపాటు పనులు చేయకూడదు. సీతమ్మ లంకలో ఉన్నప్పుడు తొందరగా చనిపోతే బాగుండును, రాముడు ఇక్కడకు రావచ్చు రాలేకపోవచ్చు, నన్ను రావణాసురుడి బందిఖానాలో నుండి విడిపించవచ్చు విడిపించలేకపోవచ్చు, తొందరగా చనిపోవటమే మంచిదేమో అని సీతమ్మ ఎప్పడైనా అనుకొనేది. మనకు అయినా కష్టాలు వచ్చినప్పడు అలాగ అనుకొంటాము, అది సహజం. ఆంజనేయస్వామి వెళుతూ ఒకమాట చెప్పాడు. ఇప్పడు ఈ కష్టకాలంలో నీకు సహనం అవసరం, నువ్వు ఓర్పుగా ఉండాలి, జీవితం అందమైనది. నువ్వు తొందరగా ఈ జీవితాన్ని ముగించుకొంటే అందమైన జీవితాన్ని ముగించుకొంటున్నావు, తరువాత ఆత్మజ్ఞానం సంపాదించుకొనే అవకాశాన్ని కూడా పోగొట్టుకొంటున్నావు. రాముడికి ధైర్యం అవసరం, నీకు ఓర్పు అవసరం. రాముడు ధైర్యంగా ఉన్నాడు. నువ్వు ఓర్పుగా ఉంటే రాముడు వస్తాడు, నిన్ను విడిపించుకొని తీసుకువెళతాడు. రాముడు వస్తాడా రాడా అని నీకు అనుమానంగా ఉంటే వాడి శక్తి మీద నీకు నమ్మకం లేదు అని అర్థమవుతోంది. నీకు అపనమ్మకం ఉండ కూడదు, విశ్వాసం ఉండాలి. రాముడు వస్తాడు, నిన్ను విడుదల చేస్తాడు అని ఆంజనేయ స్వామి సీతమ్మకు చెపుతాడు.

మన పెద్దలు ఏమని చెపుతున్నారు అంటే మీ మనస్సును నాలుగు భాగాలు చేసి అందులో మూడు భాగాలు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటానికి కృషి చేసుకోవాలి అంటే సత్పురుషుల సహవాసం చెయ్యండి, సత్కర్మ చెయ్యండి మీ పద్ధతిలో మీరు ప్రయత్నం చేస్తూ సత్యాన్వేషణకు ఉపయోగించుకోవాలి, మిగిలిన ఒక వంతు మీ దేహం వచ్చింది

కాబట్టి సంసారం వస్తుంది అందుచేత దానిని సంసార పోషణకు, లోకానికి సంబంధించిన పనులకు ఉపయోగించుకోండి, అలా జీవిస్తూ ఉంటే మీరు తొందరగా ఒడ్డుకు వచ్చేస్తారు అని చెపుతున్నారు. ఆ దేహప్రారబ్దాన్నిబట్టి భగవంతుడు ఒకో దేహానికి ఒకో పనిని కేటాయిస్తాడు. దేహప్రారబ్దాన్ని మనం ఇష్టంగా అనుభవించాలి. దేహప్రారబ్దాన్ని ఎంజాయ్ చెయ్యాలి కాని దానిని వూసేయకూడదు. ఒకవేళ మీకు దేహప్రారబ్దంలో చెడు ఎదురైనా దానిని ఎంజాయ్ చేయగలిగితే, దానిని భగవంతుడి ప్రసాదంగా స్వీకరించగలిగితే భవిష్యత్‌లో అటువంటి ప్రారబ్దం ఎదురవ్వదు, మీరు దానిని చిరాగ్గా, కష్టంగా అనుభవిస్తే వచ్చే జన్మలలో అదే మనకు ఎదురవుతుంది. స్థూలశరీరం నుండి చైతన్యశక్తి తప్పకొన్నాక దీనిని స్మశానంకు తీసుకొనిపోతారు, పుల్లలతో కాల్చేస్తారు. స్థూలశరీరం ఎలాగూ కాలిపోతుంది. కాని లోపల ఉన్న సూక్ష్మశరీరం పుల్లల వలన కాలదు, అది వైరాగ్యం వలన కాలుతుంది. ప్రపంచంలోని ఏ రూపంమీద, ఏ నామంమీద, ఏ వస్తువుమీద మీ మనస్సు వాలకుండా ఉంటే, మనిషికి పరిపూర్ణమైన వైరాగ్యం ఉంటే వాడి సూక్ష్మశరీరం కాలిపోతుంది. సూక్ష్మశరీరం కాలకపోతే మరల దానికి స్థూలశరీరం వచ్చేస్తుంది.

లక్ష్మీనర్శింహస్వామి ప్రహ్లాదుడికి దర్శనమిచ్చి, హిరణ్యకసిపుడిని సంహరించాక ప్రహ్లాదుడితో నీకు ఏదైనా కోరిక ఉంటే కోరుకో ఇస్తాను అంటాడు. ప్రహ్లాదుడికి కోరుకోవటం ఇష్టంలేదు, ఆయనకు నిజంగా కోరికలు లేవు. ఆయన పరమభక్తుడు, బాగా ఏకాగ్రత కలిగినివాడు. ఏదో ఒకటి కోరుకో అంటే అప్పడు ప్రహ్లాదుడు ఏమన్నాడు అంటే నాకు ఎప్పడూ ఏ కోరిక రాకూడదు అటువంటి కోరికను నాకు ఇవ్వండి అన్నాడు, దానికి భగవంతుడే ఆశ్చర్యపోయాడు, అందుకే భక్తులలో ప్రహ్లాదుడికి అగ్రస్థానం ఇచ్చారు. కోరిక పెట్టుకోవటం వలన అది వస్తుంది, కోరిక లేకపోతే రాదు అని మీరు అనుకొంటారు. మీకు వచ్చేదానికి, పోయే దానికి మీ కోరికకు ఏమీ సంబంధం లేదు. మీ దేహం భూమి మీదకు వచ్చినప్పడే ఆ దేహం ద్వారా ఏమి జరగాలో నిర్ణయింపబడుతుంది, ఆ ప్రణాళిక ప్రకారం ఏది ఎప్పడు జరగాలో ఆ దేహం ద్వారా జరిగిపోతూ ఉంటాయి. మీరు వద్దు వద్దు అనుకొన్నా మీ ప్రారబ్దంలో ఉన్నది వచ్చి మీ నెత్తిమీద పడుతుంది, మీకు రాకూడనిది మీరు కావాలని ప్రయత్నం చేసినా అది రాదు. మనకు ఈశ్వరుడిపట్ల విశ్వాసం లేకపోవటం వలన వీటిమీద

మనకు నమ్మకం కుదరటం లేదు. భగవంతుడు చెప్పిన వాక్యాలను అర్థం చేసుకోవాలి అనే తపన మనకు లేదు. మన ఇంటి దగ్గర బంగారాన్ని ఎలా జాగ్రత్తగా దాచుకొంటామో అలాగ భగవంతుడి వాక్యాలను జాగ్రత్తగా హృదయంలో దాచుకోవాలి అని మనకు లేదు. ఇంట్లో ఉన్న బంగారం మనకు మోక్షాన్ని ఇవ్వదు. మీ మనస్సు బంగారం అయితే మోక్షం వస్తుంది.

మనలో రకరకాల వాసనలు ఉంటాయి. ఎంతో అభ్యాసం చేస్తేగాని ఆ వాసనలు నశించవు. ఆ వాసనలను తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి, కాలం కలిసి రావాలి, దేవుని అనుగ్రహం ఉండాలి. అంతర్యామి యొక్క దయ లేకపోతే ఒక్క అలవాటులో నుండి కూడా జీవుడు బయటకు రాలేడు, ఆయన దయ లేకుండా మన వలన ఏమీ సాధ్యం కాదు. రామకృష్ణపరమహంసగారి భార్యకు పుట్టింటి దగ్గర ఉండగా బాగా విరోచనాలు పట్టుకొంటాయి. ఆవిడ ఎంతోకాలం బతకదు, ఆవిడ చనిపోతుంది అని రామకృష్ణుడితో చెపుతారు. అయ్యో నా భార్య చనిపోతుందా అని ఆయన ఏడవలేదు. భార్య గురించి ఆయన ఏమన్నారు అంటే అయ్యోపాపం ఆ దేహం ఎందుకు వచ్చినట్లు, ఆత్మానుభవం పొందకుండా ఆ దేహం చనిపోతే ఇంకెన్ని జన్మలు ఎత్తాలో, ఆత్మానుభవం పొందకుండా ఆ శరీరం పోతే ఆవిడ చాలా కష్టం అనుభవిస్తుంది అన్నారు అంటే అక్కడ ఆయన భార్యగా చూడటంలేదు, ఆవిడ కూడా ఒక జీవుడే, ఆ జీవుడు తరించాలి. తరించకుండా అప్పుడే వెళ్ళిపోతే ఎలాగ? జ్ఞానం సంపాదించాలి కదా. మరిజ్ఞానం సంపాదించకుండా వెళ్ళిపోతే ఆ శరీరం ఎందుకు వచ్చినట్లు, అది ఈశ్వరుడి కరుణ. అంటే ఆత్మజ్ఞానం సంపాదించకుండా ఆ శరీరం పోతోంది ఏమిటి అనుకొంటున్నాడు కాని తన భార్య ఏదో పోతోంది, తనకు ఏదో నష్టం వచ్చేస్తోంది అనే భావన లేదు, వాడు ఆచార్యుడు. రామకృష్ణుడు చివరి రోజులలో నరేన్ నీకు ఏమి కావాలి అని అడిగాడు. నాకు ఏమీ అక్కరలేదు, నాకు మోక్షం కావాలి అన్నాడు. ఏం నరేన్ నువ్వు చాలా పెద్దవాడవు అనుకొన్నాను, ఇంత చిన్నవాడవా, ఇంత చిన్న మనస్సా, నీకు మోక్షం వస్తే సరిపోతుందా, మరి మిగతా వారి మాట ఏమిటి? ఆయనకు 16 మంది శిష్యులు ఉన్నారు, నేను చనిపోయాక ఈ పిల్లలు చెదిరిపోకుండా చూడు, వారిని విడిచిపెట్టవద్దు, వారిని జాగ్రత్తగా చూసుకో అని చెప్పారు.

ఎవరికైతే జ్ఞానం కలిగిందో వారిని ఇంక భగవంతుడు పునర్జన్మలలోనికి పంపడు.

పచ్చిపచ్చిగా ఉన్న మనలను పునర్జన్మలకు పంపేస్తూ ఉంటాడు. ఈశ్వరుడు చేసే పని అది, ఆచార్యుడు అలా కాదు. మనలను ఎండింపచేస్తాడు. దేవుడిచేతికి దొరకకుండా, పునర్జన్మల లోనికి వెళ్లకుండా మనలను ముందుగానే ఎండింపచేస్తాడు, వాడు ఆచార్యుడు. తిలక్‌గారు జైలులో ఉండగా ఆయన భార్య స్వర్గస్థులైనారు. ఫలానారోజున స్వర్గస్థులైనారు అని తిలక్‌గారికి ఉత్తరం వ్రాసారు. ఆ ఉత్తరం జైలరు తిలక్‌గారికి ఇచ్చాడు. ఆయన ఏదో వ్రాసుకొంటున్నారు, ఈ ఉత్తరం జేబులో పెట్టేసుకొని మామూలుగా వ్రాసుకొంటున్నారు. ఏమండీ తిలక్‌గారు ఆ ఉత్తరం ముందు చూసుకోండి అని జైలర్ చెప్పాడు. ఆ ఉత్తరం చదువుకొని జేబులో పెట్టేసుకొని మరల వ్రాసుకొంటున్నారు. అది చూసి జైలర్ ఏమండీ తిలక్‌గారు ఈ పద్ధతి నేను ఎక్కడా చూడలేదు. మీ సహధర్మచారిణి, మీతో 50 సం॥లు కలిసి ఉంది, ఆవిడ చనిపోతే మీరు కంటినీరు కూడా పెట్టుకోవటంలేదు, మిమ్మల్ని ఏమనుకోవాలో నాకు అర్థం కావటంలేదు. మిమ్మల్ని మహాత్ముడు అనుకోవాలో లేక దురాత్ముడు అనుకోవాలో నాకు తెలియటంలేదు. ఎంత కఠిన హృదయుడికి అయినా సహధర్మచారిణి పోతే కన్నీళ్ళు వస్తాయి. మీరు జైలులో ఉండగా ఆమె చనిపోయింది అని మేము బాధపడుతున్నాము అని జైలరు అన్నాడు. తిలక్‌గారు జైలరు వంకజూసి ఏమయ్యా ఏడవటానికి కళ్లల్లో నీళ్ళు ఉండాలి కదా అన్నారు. ఈ భారతదేశం కోసం 30 సం॥ల నుండి ఏడుస్తున్నాను. భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొని రావాలని 30 సం॥ల నుండి ఏడుస్తూ ఉంటే, ఇలా ఏడ్చి ఏడ్చి కళ్లల్లో ఉన్న నీరు అంతా ఖర్చు అయిపోయినాయి. ఇప్పడు కొత్తగా నా భార్య పోయింది అని నీళ్ళు రమ్మంటే ఎక్కడనుండి వస్తాయి, కళ్లల్లో నీరు ఉంటే కదా వచ్చేది. ఏడవమని నువ్వు అంటున్నావు, దుఃఖపడటానికి కళ్లల్లో నీరు ఉండాలికదా అని జైలర్‌తో తిలక్‌గారు అన్నారు. అంటే వారు కేవలం లోకం కోసం జన్మించిన జీవకోటి.

ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని ముందు విశ్వసించండి. దేవుడికి ఆకారం ఉండవచ్చు, ఆకారం లేకపోవచ్చు. ఆ పేచీల జోలికి వెళ్లవద్దు. వాడు నిరాకారుడు అవ్వవచ్చు, సాకారుడు అవ్వవచ్చు కాని దేవుడు ఉన్నాడు. మీరు లేడు అనుకొన్నంతమాత్రం చేత ఉన్నవాడు ఎక్కడికి పోతాడు. వాడే కర్మఫలదాత. భగవంతుడు అనేవాడు ఉన్నాడని విశ్వసించండి. అలా విశ్వసిస్తే మనకు సొమ్ము, లేకపోతే దుమ్ము. రాగద్వేషాలు లేకుండా

మీ మనస్సును సంస్కరించండి. రాగద్వేషాల నుండి మీ మనస్సును తప్పించారు అనుకోండి దానంతట అదే వెళ్ళి గూటిలో పడిపోతుంది. ఆత్మజ్ఞానం మాట అటు ఉంచండి, రాగద్వేషముల నుండి మనిషి బయటకు రావటం చాలాకష్టం, ఆచరించినప్పడే అందులో ఎంతకష్టం ఉందో మనకు తెలుస్తుంది. సమాజంలో అందరూ అమాయకులు ఉండరు, కొందరు గట్టికారులు ఉంటారు అని రామకృష్ణుడు చెప్పాడు. ఒక భక్తుడు చాలా తెలివైన వాడు. వాడికి దేవుడు కనిపించి ఏదైనా కోరుకోమన్నాడు. వాడు ఏమన్నాడు అంటే మా ముని మనమడు బంగారం కంచంలో తింటూ ఉంటే నాకు చూడాలని ఉంది అన్నాడు. దాని అర్థం ఏమిటి అంటే వాడి ముని మనవడు పుట్టేదాక వీడు ఉండాలి. బాగా సంపద ఉన్న వారికి బంగారపు కంచాలు ఉంటాయి. వాడి కుటుంబంలో ముని మనవల వరకు సంపదలు ఉండాలి. అంటే ముని మనవల వరకు వీడు ఉండాలి, మామూలుగా ఉండటం కాదు, ఐశ్వర్యంతో బతికి ఉండాలి, లోకంలో అంతగట్టికారులు ఉంటారు. అహంకారం పెంపుడు కుక్కలాంటిది అన్నారు రామకృష్ణుడు. కొంతమంది కుక్కలను పెంచుతారు. వారు తినేది పెడతారు. అది వారి ఒడిలో కూర్చొంటుంది, బుగ్గలు నాకుతుంది, యజమాని రెండు రోజులు కనబడకపోతే ఏడుస్తుంది. మనం అహంకారాన్ని విడిచిపెట్టాలి అని ఎలా అనుకొంటున్నామో అలాగే ఆ కుక్క అలవాటు పోగొట్టుకోవాలి అని యజమాని అనుకొన్నాడట. అది వచ్చి ఒడిలో కూర్చొంటే గెంటేసేవాడట, మరల వచ్చేదట. ఎక్కువ అలవాటుగా వస్తూ ఉంటే కర్ర పుచ్చుకొని కొట్టేవాడట. అలా ఆరు నెలలు చేస్తేగాని ఆ కుక్క దగ్గరకు రావటం మానలేదట. అహంకారం కూడా కుక్కలాంటిదే. కుక్క బయట కనిపిస్తోంది, అహంకారం బయటకు కనిపించేది కాదు. ఆ కుక్కను వదిలించుకోవటానికే యజమాని అంతకాలం కష్టపడవలసి వస్తే అహంకారం వదిలించుకోవటానికి ఇంక నువ్వు ఎన్ని జన్మలు కష్టపడాలో అన్నారు. నేను అనేది నిజం కాదు, అది ఒక తలంపు. అది నిజం కాకపోయినా నిజం అని మనం అనుకొంటున్నాము. మనం నిజం అనుకొన్నప్పుడు కూడా అది అబద్ధమే. దానికి రూపం లేదు కాని చనిపోయేవరకు ఏదో రూపాన్ని పట్టుకొని ఉంటుంది. అహంకారం ఉన్నంతసేపు ఈ నామాలు, రూపాలు. అహంకార రహితస్థితిలో నేమ్‌లెస్, ఫారమ్‌లెస్, వరల్డ్‌లెస్, గాడ్‌లెస్. అది నోటితో చెప్పేది కాదు, అది అనుభవైక వేద్యం. దేహం చనిపోయే వరకు ప్రారబ్ధకర్మ ఉంటుంది అంటారు, దేహం ఉండగా దానిని తప్పించుకోగలమా అని

ప్రశ్న. దేహము నేను అనే భావన ఎప్పుడైతే పోయిందో అక్కడ నామరూపములు ఉండవు, ఏ రూపం, ఏ నామం వాడిని బంధించదు. ప్రారబ్దం కూడా వాడిని బంధించదు. ప్రారబ్దం ఎవడు అనుభవిస్తాడు, మనస్సు అనుభవిస్తుంది. అనుభవించే మనస్సు చిరిగిపోయినప్పుడు ప్రారబ్దం ఎక్కడ ఉంది. ఒకవేళ ఆ దేహానికి రోగం రావలసి ఉంటే వస్తుంది కాని ఆ రోగం నన్ను పట్టుకొంది, నన్ను బాధపెడుతోంది అనుకొనే మనస్సు అక్కడ ఉండదు. అందుచేత చూసేవారికి వాడు ప్రారబ్దం అనుభవిస్తున్నట్లు కనిపిస్తుంది కాని వాడికి ఏమీ ఉండదు, వాడు బ్రహ్మానుభవంలో ఉంటాడు.

భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మనస్సు చిరిగిపోవాలి. మనస్సు ఉన్నంతసేపు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం, ఇతర లోకాలు, పునర్జన్మలు అన్నీ ఉన్నాయి. అది కాలిపోతే ఏమీ లేదు. నువ్వు దానిని బయటకు లాగి కాల్చాలి. అహంకారాన్ని పోగొట్టుకోవటం చాలా కష్టం. అది ఒక పట్టాన పోదు, కష్టం అని ప్రయత్నం చెయ్యటం మానవద్దు, నువ్వు ప్రయత్నం చెయ్యి. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే గొడవల గురించి నీ తలకాయ ఎందుకు పాడుచేసుకొంటావు. ఏది పొందాలో దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి, కురచ ఆలోచనలు వద్దు. ఏదో ఈ రోజు గడిచిపోయింది కదా అలా అనుకోకు. ఈ రోజు గడచి పోవటం ఏమిటి? నీకు ఒక గమ్యం లేదా? ఈ రోజు మనకు ఏదో జరుగుబాటు ఉందని మనం ఇష్టం వచ్చినట్లు కర్మ చేయకూడదు. దేవుడు చెయ్యమని చెప్పింది మనం చెయ్యాలి. మన మనస్సును బాగుచేసుకోవాలి. ధనం ఉన్నప్పుడు మనం దానిని సద్వినియోగం చేసుకోవాలి. ధనం ఉంది కదా అని కోరికలు పెంచుకొంటూ వెళ్ళిపోతాము అనుకోండి, మరల ఆ కోరికల నుండి బయటకు రావటానికి కొన్ని వందల జన్మలు సాధన చెయ్యాలి, అప్పుడు మనకు ఉన్న ఐశ్వర్యమే మనకు శాపం కింద మారుతుంది. ధనం, తెలివి, పాండిత్యం ఇవి ఏమీ చెడ్డవికావు, వాటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవే మనలను పతనం చేస్తాయి. రాత్రిళ్ళు తొందరగా ఎందుకు నిద్ర పట్టదు అంటే కోరికలు, వాసనలు మూసేస్తూ ఉంటాయి. కర్మలు చేయటం వలన వాసనలు, సంస్కారాలు వస్తాయి. అందుచేత కర్మ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. మీకు తొందరగా నిద్ర రావాలంటే ఇష్టమైన భగవంతుడి రూపాన్ని ధ్యానం చేస్తూ ఉంటే, ఆ నామాన్ని స్మరిస్తూ ఉంటే కర్మ

వాసనలు వచ్చినా మీ మనస్సు ఆ రూపాన్ని పట్టుకొని ఉంది కాబట్టి అవి వచ్చి వెళ్ళిపోతాయి. అలాగ తలంపులు వస్తూ ఉంటాయి, వెనక్కి వెళ్ళిపోతాయి, మీకు నిద్ర పట్టేస్తుంది. ప్రారబ్ధం అయినా, సంచితం అయినా, ఆగామి అయినా ఈ కర్మలు అన్నీ మనస్సుకే. మనస్సు అనే గడప దాటితే ఈ కర్మలకు అసలు అర్థం లేదు, కర్మఫలితం నిన్ను ఏమీ అంటదు.

నిజంగా సాధన చేసుకొనేవాడికి అసలు టైము చాలదు అని శారదామాత చెప్పేవారు. మీలో ఉన్న పొరపాట్లు ఏమిటో, మీలో ఉన్న బలహీనతలు ఏమిటో మీరు వెతుక్కోవటం మానేసి ఇతరులలో ఉన్న బలహీనతలు ఏమిటి అని వెతుక్కోవటం వలన మీకు ఏమి కలిసి వస్తుంది, దాని వలన ఏమీ కలిసిరాదు. ఇతరులలో ఉన్న పొరపాట్లు చింతించటం వలన ఇంకో నష్టం, వాటిని చింతిస్తూ ఉంటే కొంతకాలానికి అవి నీకు వచ్చేస్తాయి. మీలో ఉన్న బలహీనతలు ఏమిటి అని తెలుసుకొని వాటని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యండి. ఈ కొమ్మలు, ఆకులు, కాయలు ఈ గొడవలు వదిలెయ్యి ముందు చెట్టు యొక్క వేరు నరికెయ్యి. దేహము నేను అనే తలంపు అజ్ఞానమనే వృక్షానికి వేరులాంటిది. ఆ వేరును నరికేయటానికి చూడు. దానిని నరకటం వదిలేసి పైపై వాటిని నరకటం వలన కాల ప్రవాహంలో అవి మళ్ళీ వచ్చేస్తాయి. ఆకులు రాలగొడితే మరల ఆకులు వచ్చేస్తాయి, కొమ్మలు నరికితే కొమ్మలు మరల వచ్చేస్తాయి, చెట్టు మొదట్లో కొట్టేసినా మరల చెట్టు వచ్చేస్తుంది, ఆ వేరును నరకాలి. దేహము నేను అనే తలంపు ముందు నాశనమవ్వాలి. అది నాశనం అవ్వకపోతే నిన్ను ప్రకృతి విడిచిపెట్టదు, సంసారం విడిచిపెట్టదు. అలవాట్లు ఎంత ప్రమాదం అంటే ప్రవచనం గంట చెపితే సరిపోతుంది, గంట చెపితే చాలు అని నేను అనుకొంటాను. ఇలా మూడు గంటలు చెప్పే అలవాటు తగ్గించుకోవటానికి పెద్ద సాధన చేయవలసి వస్తోంది. ఇంక ఈ నేనును పోగొట్టుకోవటానికి ఎంత సాధన చెయ్యాలో చూడండి. అది కూడా ఒక అలవాటే, అది పోవటం ఎంత కష్టమో చూడండి. మీ మనస్సును నాలుగు భాగాలు చెయ్యమన్నారు. మూడు భాగాలు దేవుడికి ఇమ్మన్నారు. ఒక భాగం సంసారానికి ఇమ్మన్నారు. ఇలా చేస్తే నెమ్మదిగా ఈ మూడు భాగాలు కలిసి ఆ భాగాన్ని తినేస్తాయి. మీరు చేసిన పనులు అన్నీ కలిసి వస్తున్నాయి అనుకోండి, గర్వం తెచ్చుకోవద్దు. మీరు ఏదైనా నష్టపోతున్నారు అనుకోండి, కృంగిపోవద్దు. అదీ నిజంకాదు, ఇదీ నిజంకాదు. మీ మనస్సు ఎలా ఉందో ఏ రోజుకారోజు పరిశీలన చేసుకొంటూ ఉండండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| అక్టోబర్ | 9 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| నవంబర్ | 2 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# మనస్సులోని దోషాలను పోగొట్టుకోవటమే – సాధన

మనస్సు మలినమైనది, మోసకారి అది మనలను ఆత్మ సుఖాన్ని అందుకోకుండా చేసే శత్రువు అట్టి శత్రువును ప్రేమిస్తే సుఖం ఎలా ప్రాప్తిస్తుంది. బయట శత్రువుల నుండి తప్పించుకోవచ్చును, శక్తియుక్తమైన మనోపన్నాగాల నుండి తప్పకోలేము. అది చెప్పే విషయాలను నమ్మకూడదు, దానికి క్రమశిక్షణ నేర్పాలి. గురు ఆజ్ఞలో ఉండేలా ప్రయత్నం చేయించాలి. శ్రీనాన్నగారు "మన బుద్ధి చేతుల్లో మనస్సు ఉంటే పురోగతీ, మనస్సు చేతిలో బుద్ధి ఉంటే తిరోగతీ. మనస్సు ఆత్మానందాన్ని ఒక్కసారి రుచి చూచిందా దానికి మించిన బంటు మరొకటి ఉండదు" అన్నారు. స్వార్థాన్ని వదలి నేను చేస్తున్నాను అనే బుద్ధి లేకుండా అనాసక్తిగా పని చేసే స్వభావమే మనకు అపారశక్తి సామర్థ్యాలను, కార్యదీక్షతను ప్రసాదిస్తుంది అని విశ్వసించాలి. ఇది కష్టమైన పనేకాని ఇంతకన్న వేరే మార్గం లేదు అంటారు పెద్దలు. పురిటి నొప్పులు భరించకుండా ఒడిలోకి కొడుకును ఎలా పొందగలదు తల్లి. కష్టమైన మాట భరించకుండా సాధన లేకుండా సిద్ధి ఎలా సాధ్యం. బుద్ధుడు "నీకు తెలియని నిర్వాణ సుఖాన్ని అలా ఉంచు, నీకు తెలుసున్న మనస్సులోని దోషాలను తొలగిస్తే తెలియని నిర్వాణ సుఖం నీకు తెలియబడుతుంది" అన్నారు. గురు రూపాన్ని ధ్యానం చెయ్యటం ద్వారా మనస్సు ఏకాగ్రమై, నిర్మలత్వం పొందుతుంది. మనకి కళ్యాణ గుణాలు తెలియకపోయినా అవి మనలో వృద్ధి అవుతాయి. ఊరికే కూర్చున్నప్పడు కూడా మన దృష్టి ఎక్కడ బడితే అక్కడకూడా గురుమూర్తిని ఊహించుకోవాలి. ఇలా మనం ఒక నిర్దిష్టమైన దశకు చేరుకొన్నప్పడు ఆ గురు రూపం కూడా జారిపోయి అప్పడు పూర్ణ స్థితిని పొందుతాము. దీనినే భ్రమర కీటక న్యాయం అంటారు. పురుష ప్రయత్నము చేత, శుభకర్మల చేత పొందరానిది ఏదీ లేదు; దీపపు కాంతిచే చీకటి నశించినట్లే గురు ధ్యానంతో వాసనలు నశించిపోతాయి. మనం వెట్టి మొట్టి ఆలోచనలతో రోజు అంతా వృధా చేసుకొంటున్నాము. అనవసరపు భయాలు, సందేహాలు, అర్థం లేని ఆందోళనలతో కలల ప్రపంచంలో, ఊహా లోకాల్లో ఉయ్యాల లూగుతూ బ్రతుకుతున్నాము అని ముందు గుర్తించి మరలాలి. నిజాల ప్రపంచంకంటే, నీడల ప్రపంచంలోనే మనం జీవిస్తున్నాము. మనం నిరాశ, నిస్పృహ భావాలకు లోనైతే వాటిని మెడబెట్టి బయటకు నెట్టి, దాని స్థానంలో నేను పరమాత్మనే ఈ సృష్టిలో నన్ను ఏ శక్తి ఏమీ చెయ్యలేదు అన్నప్పడు పై దౌర్భాగ్యాలు పలాయన మౌతాయి. దానికి అదే మందు అలా కాకుండా తాపత్రయాలలో కృంగిపోయేవాడు సంసార సముద్రంలో మునిగిపోతాడు. గురు పాదాలను ఆశ్రయిస్తే అంతా సుఖమే.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**

# సద్గురువు

గురువన్న ఎవరో ఎరుకపరచే సద్గురువు,
గుప్త సత్యములే గురుతు చేసే సద్గురువు,
గురువన్న ఎవరో ఎరుకపరచే సద్గురువు,
గుప్త సత్యములే గురుతు చేసే సద్గురువు,
చీమలో బ్రహ్మలో జీవరాసులలో దేవుడే గలడని తెలియచేసే సద్గురువు,
గురువన్న ఎవరో ఎరుకపరచే సద్గురువు,
గుప్త సత్యములే గురుతు చేసే సద్గురువు
శ్రద్ధ, భక్తి, సహనశక్తి - శ్రద్ధ, భక్తి, సహనశక్తి
అర్చన, అర్పన, ఆత్మానురక్తి సాధించగలిగేతే సద్గురువుదొరుకునని,
పరామర్ధమందగ పధమతర చూపునని,
పరామర్ధమందగ పధమతర చూపునని,
మంత్రోపదేశములు మార్గములు కావని,
మంత్రోపదేశములు మార్గములు కావని,
నియమ నిష్ఠలు నిలిపితే చాలాని
విశ్వాసముంచితే విభుడు కరుణించునని
జ్ఞానసాధనచే జ్ఞానమొసగేనని, జ్ఞానసాధనచే జ్ఞానమొసగేనని,
గురువన్న ఎవరో ఎరుకపరచే సద్గురువు,
గుప్త సత్యములే గురుతు చేసే సద్గురువు,
ప్రతిఫలం కోరక పాలించు చుండునని,
ప్రతిఫలం కోరక పాలించు చుండునని,
ఆత్మార్పణం ఒకటే ఆశించుచుండనని,
అతని సేవించిన బత్రుకే ధన్యమని,
అజ్ఞాన తిమిరాలు అణిగించు చుండునని,
అజ్ఞాన తిమిరాలు అణిగించు చుండునని,
పరుల ధూషించుట పాపకర్మమని,
పరుల ధూషించుట పాపకర్మమని,
తనతప్పల ఎరుగుట ధర్మ సూక్ష్మమని,
అరుదైన పుణ్యకర్మచే నరజన్మ లభించునని,
సద్గురువుని కొలువ సార్ధకత కలుగునని,
సద్గురువుని కొలువ సార్ధకత కలుగునని,
గురువన్న ఎవరో ఎరుకపరచే సద్గురువు,
గుప్త సత్యములే గురుతు చేసే సద్గురువు,
చీమలో బ్రహ్మలో జీవరాసులలో దేవుడే గలడని తెలియచేసే సద్గురువు

- ఒక భక్తుడు